
విడి ప్రతి 10 రూ.

ఫిబ్రవరి 2008


# స్పందన

ఆధ్యాత్మిక మాసపత్రిక



... ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి.

మార్కు 11:24




**ఆచార్య ఆరార్కే గారి 80వ పుట్టిన రోజు '08 ఫిబ్రవరి 29**

ఈ మంచి శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఓ ప్రత్యేకమైన సావనీర్
ఒకటి మార్చి - స్పందన సంచికతో ప్రచురిస్తున్నాము.
ప్రార్థించండి. ఎదురు చూడండి. ఆరార్కే జీవిత విశేషాలు,
సేవలో వారి అనుభవాలనేకం అందులో పొందుపరచబడనైయున్నాయి.
మీరు కూడా ఆరార్కే గారి పరిచర్యల ద్వారా ఎలా దీవించబడ్డారో
సాక్ష్యాలు వ్రాసి పంపవచ్చు,
సంఘాలు, సంస్థలు మీ ప్రకటనలు ఇవ్వవచ్చును.

మరిన్ని వివరాలకు
**ఆరార్కే బర్త్‌డే సావనీర్,**
స్పందన, పోస్ట్ బాక్స్ 415, విజయవాడ-2.

18. దేవుడు మనకు చేసిన మేలు విస్మరించలేము అనే దానికి మరోమాట

19. విగ్రహారాధికులు దీన్ని పదే పదే త్రిప్పుతుంటారు.

21. వస్తువులు ముడిసరుకుతో తయారవుతాయి. మరి "వస్తువు" లేదు. సమానం తారుమారు.

22. ఇతను చెడ్డవాడు కాడు. బాగానే పాడతాడు.

**నిలువు:**

1. ఇతని వలనే అబ్రాహాము సంతానం అనబడుతుంది.
2. యేసు రక్షకుడు యేసు – కూడా

4. హోమానికి వాడే సంబారం.

5. ఇది ఎక్కడి రోజా – షూలమ్మితికి పెట్టిన పేరు.

6. ముక్కులేని పిల్లకు వాసన ఏమి తెలుస్తుంది?

10. యుద్ధాలు ఎలాంటి హోమాలు?

14. యేసును బల్లెంతో పొడిచారు. సైనికులు వీరికి మరోమాట.

16. మనకు కొత్త – యేసు ప్రభువే "సిరి" కాదు.

17. దీనికి విశ్రాంతి లేదు. అలాగే దుష్టులకు కూడా.

20. ఏ రోజు – ఆ రోజుకే చాలు.

## ఆచార్య ఆరార్కే గారి
### వీడియోలో యెషయా గ్రంధ వ్యాఖ్యానాలు



ఈ మధ్యనే దైవజనులు ఆరార్కే గారు, డా॥ దేవ గారు దుబాయ్‌లో ఉన్న తెలుగు ప్రజల మధ్య సేవజరిగించటానికి వెళ్లినపడు సోదరులు బాబు గంటా దైవాత్మ ప్రేరణతో ఒక మంచి సేవా కార్యక్రమానికి పూనుకున్నారు. అదేమంటే దైవజనులు ఆచార్య ఆరార్కే మూర్తి గారి బైబిలు వ్యాఖ్యానమంతా, ఆదికాండం నుండి ప్రకటన వరకూ వీడియోలో రికార్డు చేయాలని. ఇది చాలా ప్రశస్తమైన సేవ. ఆరార్కే గారి చక్కని తెలుగు, బైబిలును ఆత్మ పూర్ణతతో వ్యాఖ్యానం ప్రత్యక్షంగా చూడటం కోసమే గాక భావితరాల వారికి కూడా ఇది ఎంతో ప్రయోజనం కలిగిస్తుంది. అయితే ఇది చాలా వ్యయప్రయాసలతో కూడుకున్న పని. దైవజనులు ఆరార్కే గారు ఎంతో సమయాన్ని ఇందుకోసం వెచ్చించాలి. వీడియో షూటింగ్‌కు మాత్రమే గాక దానిని బైబిలు సంబంధిత చిత్రాలతో కలిపి చేయటం చాలా ఖర్చుతో కూడిన పని. గల్ఫ్‌లో ఉన్న అనేక మంది తెలుగు ప్రజలు ఒక్కో కార్యక్రమానికి సుమారు రు.5,000 విరాళంగా ఇస్తున్నారు. స్పందన పాఠకులలో ప్రేరేపింప బడిన వారు మీ తరపున గాని మీరు ప్రేమించే మీ ప్రియుల తరపున గాని ఒక కార్యక్రమానికయ్యే ఖర్చును కానుకగా పంపాలని మనవి.
మొట్టమొదటిగా యెషయా గ్రంధాన్ని రికార్డు చేయనున్నారు. ఇప్పటికే యెషయా గ్రంధ ఉపోద్ఘాతాన్ని రికార్డు చేశారు. ఈ గ్రంధం మొత్తం 66 కార్యక్రమాలవుతాయి. ప్రార్ధించండి. ఈ సేవలో పాల్గొని దైవాశీస్సులు స్వీకరించండి.




1976 - 2008 32 సంవత్సరాలుగా దేవుని అపార కృపలో

# స్పందన
ఆధ్యాత్మిక మాస పత్రిక

*The largest circulated Telugu monthly since 32 years*

ఫిబ్రవరి 2008 సంపుటి 32 సంచిక 2

వ్యవస్థాపక, ప్రధాన సంపాదకులు : ఆచార్య ఆరార్కే మూర్తి
ప్రచురణకర్త, సంపాదకులు : డా॥ దేవసహాయం దండల
గౌరవ సంపాదకులు : డా॥ జ్ఞాన భాస్కర్,
సంపాదక వర్గం : బ్రదర్ జి. దేవరాజు, బ్రదర్ కె. పరమానందం, బ్రదర్ ఎన్. దేవానంద్, రెవ. కె.జాన్‌మోజెస్, శ్రీమతి ఎన్. లిల్లీ భాస్కర్, బ్రదర్ ఆర్. భూషణం
సహాయ సంపాదకులు : బ్రదర్ డి. ఎఫ్రాయిం, బ్రదర్ డేవిడ్ అబ్రహాం


**ఈ సంచికలో...**


కింకర్తవ్యం
స్వయం పరీక్ష
అమ్మా, నాన్నా ఏడవకండి!
క్రీస్తుకు సాక్షిగా
తెరువబడిన ద్వారము
దైవ నరావతార అవశ్యకత
అంతిమ గురి
బైబిలు సిద్ధాంత సత్యాలు
యోవేలు
ప్రార్ధనా వేదిక
గళ్లనుడికట్టు


**చందా వివరాలు**

| | స్వదేశంలో | విదేశాలకు |
|---|---|---|
| 1 సంవత్సరం | రూ. 100 | $ 20 |
| జీవిత సభ్యత్వం | రూ. 1000 | $150 |
| పోషక సభ్యత్వం | రూ. 100 (ప్రతినెల) | $2 0 |

పత్రిక చందాకు మించి పరిచర్య అభివృద్ధి కోసం కానుకలు పంపుచున్న చందాదారులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు, స్పందన పరిచర్య నిమిత్తం మీరు పంపే కానుకలు, చెక్కులు, డ్రాఫ్టులు, ఎం.ఓ.లు, స్పందన SPANDANA పేరు మీద ఈ క్రింది అడ్రస్‌కు పంపాలి.


**స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక**
పోస్టు బాక్స్: 415, గార్లపాటివారి వీధి, దుర్గాగ్రహారం, విజయవాడ - 520 002
ఫోన్స్ : 0866 - 253 9547.
E-mail: read_spandana@yahoo.com



Founder & Chief Editor : **Acharya R.R.K.Murthy**

Printed, Published and owned by **DEVASAHAYAM DANDALA**
Printed at **Spandana Offset Printers**, Arundal pet, VJA-2. Ph:2430148, For Spandana Graphics & Published from # 30-3-13, Durga Agraharam, Vijayawada-2.

## స్పందన - ప్రతి స్పందన



**మార్గదర్శకంగా :**

స్పందన పత్రిక మాకు ఎంతో ఆత్మీయంగా, ఆశీర్వాదకరంగా వున్నది. నేను చదివి ఇరుగు,పొరుగువారికి అందిస్తాను. ఎన్నో ఆధ్యాత్మిక విషయములు తెలుసుకొని సంతోషించుచున్నాము. ఈ పత్రిక అనేకులకు మార్గదర్శకంగా వున్నది. మా ఆత్మీయజీవితం కొరకు ప్రార్థించగలరు.

**–స్వర్ణలత ఏంజిల్, కర్నూలు**

**ఆత్మీయంగా :**

స్పందన పత్రిక ఒక స్నేహితుని ద్వారా పొందుకొని చదివినాను. చాలా ఆత్మీయంగా ఉంది. ఆధ్యాత్మిక సత్యాలు తెలుసుకున్నను. స్పందన పత్రిక మాకు పంపించగలరు.

**–రావూరి ఆనందరావు, పుల్లలచెరువు**

**అనుభవం:**

స్పందన ఆధ్యాత్మిక పత్రిక మా అమ్మగారికి రెగ్యులర్‌గా వస్తుంది. నేను ఎప్పుడు స్పందన పత్రిక పరిశీలించి చూడలేదు. జనవరి నెల స్పందనలోని ప్రతి అంశము పరిశీలించి చదివితిని. ఎంతో అనుభవము గల అమూల్యమైన సందేశములు స్పందనలో పొందుపర్చ- బడినవి. అందును బట్టి వందనములు. స్పందన ఒక కాపి మా లైబ్రరికి పంపగలరు.

**–ఉయ్యూరు క్రిస్టియన్ లైబ్రరి**

**నూతన వెలుగు :**

ఈ సం॥ చందా పంపుచున్నాము. స్పందన ఆధ్యాత్మిక సందేశముల వలన మా కుటుంబములో నూతన వెలుగు వచ్చినది. దేవునికి వందనములు.

**–ఎస్. దానమ్మ, ఆల్లగడ్డ**

**ఆశీర్వాదలు :**

స్పందన పత్రిక ద్వారా ఆత్మీయ ఆనందాలు,ఆశీర్వాదలు పొందుచున్నాము.

**–పి. దానమ్మ, పెసరవాయి**

స్పందన పత్రిక మాకు క్రమంగా అందుచున్నది చదివి అనేక ఆత్మీయసత్యాలు నేర్చుకొనుచున్నాము. మా నాన్నగారి ఆరోగ్యం కొరకు ప్రార్థించగలరు.

**టి. మోహన్‌రావు, మెదక్‌జిల్లా**

**ప్రేరణదాయకంగా :**

స్పందన పత్రిక మాకు చాలా లాభదాయకంగా ఉన్నది. ముఖ్యముగా ఆరార్కేగారి రచనలు ప్రేరణదాయకముగా నున్నవి. నూతన సం॥ శుభాకాంక్షలు మా కుటుంబము తరపున అంగీకరించ ప్రార్థన. మా కుటుంబము నిమిత్తము ప్రార్థించగలరు

**–ప్రభాకర్‌రావు, తానా జిల్లా**



*సంపాదకీయం*

# అంతశ్శత్రువు

*అసూయ అసలు ఎలా ఆరంభమవుతుందో తెలుసా? సణుగుడుతో మొదలవుతుంది. దేవునికి ఫిర్యాదులు చేయటం జరుగుతుంది. సోదరీ, సోదరులమీద అభాండాలు వేసి వ్యతిరేకంగా మాట్లాడటం, పనిచెయ్యటం దాని తరువాత కార్యక్రమం. "దేవా, వారికి నీవు అదీ, యిదీ ఇచ్చావు. అంతకంటే నా కెక్కువ అక్కరవుంది. నాకివ్వలేదెందుకని? అని దేవుడికి రిపోర్టు. విశ్వాసి దేనికోసమూ సణగకూడదు. దేవునికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి.*

*ముందు నీలో వున్న అసూయను, మత్సరాన్ని పసిగట్టాలి. దానివల్ల నీకు కలిగే కీడును గుర్తించాలి. దేవుని ఎదుట ఒప్పుకోవాలి. దాన్ని వొదిలించుకోవాలి. విడిచిపెట్టాలి. పాపాలను ఒప్పుకుంటేనే గాని, దేవుని వాగ్ధానాలు మనపట్ల సార్ధకము కావు. యోహాను 1:9. సమస్త దుర్నీతి నుండి పవిత్రీకరిస్తాడు. పరిశుద్ధాత్మ నీకు సాయం చేస్తాడు. ఈ అంతః శత్రువును జయించు. నువ్వెవరో జ్ఞాపకముంచుకో క్రీస్తునందు నీవు నూతన సృష్టివి.*

*వరాల విషయంలో ఒకరిపట్ల ఒకరు అసూయపడకూడదు. ఒకరికున్న వరం మరొకరికి వుండదు. అయితే అందరూ ఒకర్నొకరు ప్రేమించుకోవాలి. సాధారణంగా అసూయ రెండు సందర్భాలలో తలెత్తుతుంది. డబ్బు - సేవ. నీ సోదరుడిని దేవుడు ఆశీర్వదిస్తే నీవు ఆనందించాలి. మత్సరపడకూడదు. రోమా 12:15 మనందరం పాటించాల్సిన హెచ్చరిక! సంతోషించే వారితో సంతోషించాలి. ఏడ్చేవారితో ఏడ్వండి. ద్వేషించిన వారిని ఆశీర్వదించి, హింసిచేవారి కోసం ప్రార్ధించండి. ఏమంటారు? దైవాశీస్సులు!*

క్రీస్తునందు భవదీయుడు

మనలోమాట

క్రీస్తునందు ప్రియపాఠకులకు
ఫిబ్రవరి మాసపు శుభాకాంక్షలు కీర్తన 34. 3 తో తెలియజేస్తున్నాను. "నాతో కూడి యెహోవాను ఘనపరచుడి. మనము ఏకముగా కూడి ఆయన నామమును గొప్ప చేయుదము."
ఘనపరచుడి, అనే మాటను గమనించండి. అంటే గొప్పగా చేయటం, పెద్దది చేసి చూడటం. ఉదాహరణకు ఒక చిన్న విషయాన్ని భూతద్దంలో చూశామనుకోండి చాలా పెద్దదిగా కనిపిస్తుంది. దావీదు భక్తుడు ఈ మంచి ఆధ్యాత్మిక అనుభవాన్ని తన జీవితంలో కలిగియున్నాడు. జీవితంలో వచ్చే ప్రతి పరిస్థితులల్లో దేవుణ్ని గొప్పగా చూడటం నేర్చుకున్నాడు. నీ మనసులో నీవు దేనిని ఘనపరుస్తావో అదే నీకు గొప్పగా, ప్రాముఖ్యమైనదిగా అనిపిస్తుంది. దావీదు తనకున్న సమస్యల్ను పెద్దవి చేయటం లేదు. అలాగే నీకున్న సమస్యల్ను గురించి ఎక్కువ మాట్లాడకు, నీ సమస్యల్ను పరిష్కరించ శక్తి గలిగిన నీ దేవుణ్ని గురించి ఎక్కువ మాట్లాడు.
కొన్ని సార్లు జీవితంలో కఠినమైన సమస్యలు, సమయాలు వస్తాయి. అలాంటి సమయంలో దేవుడు నీకు గతంలో చేసిన మహోపకార్యాలను జ్ఞాపకం చేసుకుని ప్రభువును స్తుతించాలి.
మన పితరులయిన ఇశ్రాయేలీయులు ఇదే చేశారు. " ప్రభూ, అరణ్యంలో మీరు మమ్ముల్ను ఎలా పోషించారో జ్ఞాపకం చేసుకుంటున్నాము. ఎర్రసముద్రమును రెండు పాయలుగా మీరు ఎలా విడదీశారో, మా శత్రువుల చేతిలోనుండి ఎలా మమ్ముల్ను విడిపించారో అవన్నీ జ్ఞాపకం చేసుకుంటున్నాము." అంటే మన ఉద్దేశాలు, ఆలోచనలు సరైన విధంగా ఉంచుకోవాలి. జీవితంలో సమస్యలు ఎదురవ్వటం బాధాకరమే! అయితే మన ఆలోచనలు, తలంపులు చాలా ముఖ్యం. మన సమస్యలు పెద్దవని దేవునికి చెబుతున్నామా? లేదా మన సమస్యలతో మనకెంత గొప్పదేవుడు ఉన్నాడో చెబుతున్నామా? మనమెదుర్కొనే సమస్య కొంత కాలమే ఉంటుంది. చాలా సార్లు మనం ఎదుర్కొనే సవాళ్లు మనల్ను ఉన్నత స్థాయికి తీసుకపోతాయి. పరిస్థితులు మారిపోతాయి. దేవుడు సింహాసనాసీనుడు. నిన్ను తన చేతులలో చెక్కియున్నాడు. కనుక మన జీవితాల్లో సమస్యల్ను, మనకు అన్యాయం చేసిన మనుష్యులను గురించి గొప్పగా, ఎక్కువగా మాట్లాడక మన దేవుణ్ని ఘనపరచి, గొప్పచేసే ఒక మంచి ఆధ్యాత్మిక లక్షణాన్ని మనం కలిగియుంటాము.
సరైన ఆలోచనలతో జీవితాన్ని కొనసాగించటానికి కావాల్సిన ప్రత్యేక కృపను ప్రభువు మీకు ప్రసాదించును గాక!

ప్రభువునందు మీ సోదరుడు
దేవ



# దైవజనులు ఆచార్య ఆరార్కే మూర్తి గారి 80వ పుట్టిన రోజు కృతజ్ఞత సభ

**నాలుగు సంవత్సరాలకు ఒక సారి వచ్చే ఫిబ్రవరి 29 ఆరార్కే గారి పుట్టిన రోజు. అంటే 2008 ఫిబ్రవరి 29 కు ఆరార్కే గారు 20 పుట్టిన రోజు జరుపుకుంటున్నారు. 80 సంవత్సరాల వయస్సు.**

గత కాలమంతటిలో దేవుడు చేసిన ప్రతి అద్భుత, ఆశ్చర్య కార్యాలను జ్ఞాపకం చేసికుంటూ ఆయన చూపిన కృపలు, దీవెనలు, ఆశీర్వాదాలన్నిటికి దేవునికి కృతజ్ఞతా స్తుతులు సమర్పించటానికి దైవజనునితో కలసి ఆరార్కే గారి కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, స్నేహితులు, బంధువులందరూ సమావేశమవుతాము.
ఈ ప్రత్యేక కృతజ్ఞతా సభ హైదరాబాద్‌లో ఉంటుంది.
ఈ సందర్భంగా మార్చి స్పందన సంచిక ప్రత్యేక సావనీర్‌గా విడుదల చేస్తున్నాము. పాఠకులు ఆచార్య ఆరార్కే గారి పరిచర్యల ద్వారా మీరు దీవించబడిన విషయాన్ని సాక్ష్యాలుగా వ్రాసి పంప వచ్చును. మీ సాక్ష్యాలతో పాటు ఆరార్కే గారితో మీరు తీయించుకున్న ఫోటోలు ఏవైనా ఉంటే వాటిని పంపండి, ప్రచురిస్తాము. అలాగే ఈ సావనీర్‌లో ప్రకటనలు, శుభాకాంక్షలు ఇవ్వాలని ఆశించే వారు క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించండి. లేదా స్పందన ఆఫీసుకు ఉత్తరం రాయండి.

**Size : 18.5 cm x 25 cm**

| | |
|---|---|
| Title Back Page (Multi Color) | -10,000/- |
| Title Inner Page (Multi Color) | -6,000/- |
| Title Back Inner (Multi Color) | -6,000/- |
| Inner Full Page (Multi Color) | -2,000/- |
| Inner Full Page (Single Color) | -1,000/- |
| Inner Half Page (Color) | -1,000/- |
| Inner Half Page (Single Color) | - 500/- |

డా॥ దేవ గారు - 9490113300, బ్ర. డేవిడ్ గారు - 9440280158
బ్ర. ఎఫ్రాయిం గారు - 9290538233, రెవ. కె. జాన్ మోజెస్ గారు - 9247557195,
పా॥ యేసుపాదాలు గారు - 9440302085
బ్ర. నాగేశ్వరావు గారు - 9440777925, పా॥ సురేశ్ గారు - 9247333055

మరిన్ని వివరాలకు
ఆరార్కే బర్త్‌డే సావనీర్
స్పందన, పోస్టు బాక్స్ 415, విజయవాడ - 520002

ఈ మాసపు ప్రసంగం

# కింకర్తవ్యం



ఆచార్య ఆర్కేమూర్తి



భక్త పౌలు 2 కొరింథి 10:3-5 లో ఏం చెప్పాడు. "మేము శరీరరీతిగా యుద్ధం చేయము. మా యుద్ధోపకరణాలు శరీర సంబంధమైనవి కావు. దేవుని ఎదుట దుర్గాలను పడద్రోయజాలినంత బలం కలవి. వితర్కాలను, దేవుని గురించిన జ్ఞానాన్ని అడ్డగించే ప్రతి ఆటంకాన్ని పడ ద్రోసి ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడేటట్టు చెరపట్టి తెస్తాము."

మనకు బుద్ధి కలగటానికి పాత నిబంధన రాయబడింది. పరిశుద్ధాత్మ ప్రేరణ చేత భక్తులు నేటికాలంలో వున్న మనకోసం పాత నిబంధన రాశారు. అవి తమ కోసం వారు రాసుకోలేదని 1 పేతురు 1:12లో చెప్పబడింది.

## నిబంధన ప్రజలు :

మనం నిబంధన ప్రజలం. దేవుని గొర్రెపిల్ల అయిన క్రీస్తుద్వారా దేవునితో నిబంధన సంబంధం గల ప్రజలం. అలాగయితే, పాతనిబంధన వట్టి చరిత్రేనా? దేవుడు కేవలం చరిత్రకారుడా? కాదు. దేవుడు రక్షకుడు, విమోచకుడు. దేవుడికి చరిత్రలో ఏ విశ్వ విద్యాలయమూ డాక్టరేటు యివ్వనక్కర్లేదు. దేవుని వాక్కు నిర్దుష్టమైన చరిత్ర. నిజమే-శాస్త్రీయంగా, భౌగోళికంగా, చారిత్రాత్మకంగా బైబిలు సమగ్రం, లోపరహితం, ప్రామాణికం, బైబిల్‌లో దేవుని దివ్య సౌశీల్యం కనిపిస్తుంది. ఇది యుద్ధ గ్రంథం. ప్రేమగాథ కూడా! మనమంతా రాజులైన యాజక సమూహమని చెబుతోంది బైబిలు!

దేవుని గ్రంథం పరిశీలించండి. "ప్రభువు మీ మీద సాక్ష్యం పలకబోతున్నాడు. ఆయన దిగివచ్చి భూమిపై ఉన్నత స్థలాల మీద నడవబోతున్నాడు. ఆయన నడుస్తూ వుంటే, అగ్నికి మైనం కరిగినట్లు పర్వతాలు కరిగి పోతాయి. లోయలు విడిపోతాయి. వాటం మీద పోసిన నీరు కారునట్లు అవి కరిగి పారుతాయి. ఇశ్రాయేలు పాపాన్నిబట్టే యిదంతా జరిగింది.

ఇశ్రాయేలు తిరుగుబాటుకు మూలమేది? అది షోమ్రోనే. యూదా వారి ఉన్నత స్థలాలెక్కడివి? యెరుషలేములోనే గదా?" (మీకా 1:2-5).



నా సంఘమా! నీవు వేశ్యవైపొయ్యావు! లోకంతో ఒకటైపొయ్యావు" అంటున్నాడు దేవుడు. ఈజిప్ట్‌కు వెడుతూ నైలునది జలాలు త్రాగావు. అషూరుకు వెడుతూ యూఫ్రటీసు నీళ్ళు త్రాగావు. (యిర్మియా 2:18). నా నా కూళ్ళు తిన్నావు. నీళ్ళు త్రాగావు. వెళ్ళవద్దన్న దారినే వెడుతున్నావు.

నేటి సంఘం ఈ రోజున చేస్తున్నపని యిదే! పరిశుద్ధాత్మ శక్తిలోపించింది. మానవ శక్తి మీద సంఘాలు ఆధారపడుతున్నాయి. దైవశక్తి లోపించింది. కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు, తర్ఫీతులు, తరగతులు అంచనాలు ఎక్కువయ్యాయి. ఫలితంగా అపజయం, నిరుత్సాహం సంఘాన్ని ఆవేశించాయి. - "దేవుడు అంటున్నాడు - నేను వస్తున్నాను. అంతా నేలమట్టం చేస్తాను." అంతా రాళ్ళ కుప్ప అవుతుంది. పునాదులు తవ్విపోస్తాను. కట్టుడు రాళ్ళు లోయలో పారబోస్తాను. యెహెజ్కేలు 13:14 లో గచ్చుపూత పూసిన గోడను నేలమట్టం చేస్తాను. దాని క్రింద పడి మీరు నాశనమవుతారు.

## అగ్నిపరీక్ష :

సోదర క్రైస్తవ నాయకులారా! మనం ఎలాంటి పునాది మీద కట్టబడుతున్నాం? పునాది మీద ఏం పెట్టి కడుతున్నాం? కొయ్య, గడ్డి, కొయ్యకాలా? లేక వెండి, వెలగల రాళ్లా? క్రీస్తు న్యాయపీఠం ఎదుట అగ్నిపరీక్ష వుంది - జాగ్రత్త. యధార్ధ క్రైస్తవులు అగ్నిపరీక్షలో యింకా రాణిస్తారు. లేకపోతే చివరికి మిగిలేది దోసెడు బూడిద.

నీవు ఆత్మలో నడవకపోతే శత్రువు వచ్చి. నీ చెత్తకు నిప్పంటిస్తాడు. మీకా 1:7 ప్రకారం చెక్కిన నీ ప్రతిమలు పడగొడతాను. ఇప్పుడే మనం జాగ్రత్తపడాలి. మన జీవితాలలోని విగ్రహాల చెత్తను తొలగించాలి. మీకా 2:8 ప్రకారం నామకార్ధ క్రైస్తవులు మనకు శత్రువులవుతారు.

నిర్భయంగా వాక్యం ప్రకటిస్తే మన కట్టు పంచెల్ని మాత్రం వదిలి మన పై వస్త్రాలు లాక్కుంటారు. కపట సోదరుల విషయం జాగ్రత్త!

## మహిమా, ప్రభావ దర్శనం :

సోదరీ! సోదరులారా! మహిమా ప్రభావ దర్శనం కలగబోతోంది. సంశయాత్ములు దాన్ని చూస్తారు. గాని అందులో వుండరు. మీ వూహాపోహలూ పరిశోధనలూ మీకేమి సాయపడవని నేను ఖండితంగా చెబుతున్నాను.

ఈ రోజున భారత దేశపు సంఘా లన్నిటిలోకి ఉజ్జీవం రావాలి. మీకా 6:10-11 యేసుక్రీస్తుకు ఈ రోజున సరైన నీతి ప్రమాణం కావాలి. ఎవరు గొప్ప, ఎవరి పదవి, యోగ్యత ఎంత అని ప్రభువు అడగటం లేదు.

భక్త పౌలు 2 కొరింథి 10:12 లో యిలా చెప్పాడు. తమను తామే మెచ్చుకునే కొందరితో జతపరచుకోవటానికి మేము తెగించలేము. వారు తమలోనే ఒకరిని బట్టి ఒకరు ఎన్నికచేసుకుని ఒకరితో ఒకరు సరిచూచుకుంటున్నారు. గనుక గ్రహింపు లేకుండా వున్నారు. ఇది నేటి పరిస్థితికి అద్దం పట్టినట్లుంది.

నేనిప్పుడు మీకా యిచ్చిన సందేశమే ప్రకటిస్తున్నాను. ఇప్పుడే, యిక్కడే ఆత్మ పరీక్షకు వుపక్రమించుడి. మీకా 6:1 దేవుని మాట వినండి. కొండలకు, పర్వతాలకు సాక్ష్యమివ్వండి. దేవుని ప్రజలతో నేను గోజాడుతున్నాను. ఆకలిగొన్న గొర్రెలకు మేతపెట్టడానికి దేవుడు నన్ను నియోగించాడు. వారిని బలపరచి వారి ద్వారా క్రైస్తవేతరులకు శుభవార్త ప్రకటిస్తాను.

మీకా 7:7,15లో ఇదేమాట ప్రవక్త అంటున్నాడు. "యెహోవా కోసం నేను ఎదురుచూస్తాను. రక్షణకర్త అయిన నా దేవుని కోసం నేను కనిపెట్టివుంటాను. నా దేవుడు నా ప్రార్థన ఆలకిస్తాడు. నాకీ నిశ్చయత వుంది. ఆయన కనికరం చూపటలో సంతోషించే వాడు. మనం ఆయన ప్రేమలో నిలిచి వుండాలి. విగ్రహాలను, సుళువుగా చిక్కులు పెట్టే ప్రతి పాపాన్ని విసర్జించి, పరుగుపందెంలో ఓపికతో పరుగెత్తి గెలుపు సాదిద్ధాం. దైవాశీస్సులు!

**నాలుగు సంవత్సరాలకు ఒక సారి వచ్చే ఫిబ్రవరి 29 ఆరార్కే గారి పుట్టిన రోజు. అంటే 2008 ఫిబ్రవరి 29 కు ఆరార్కే గారు 20 పుట్టిన రోజు జరుపుకుంటున్నారు.**

**ఈ సందర్భంగా మార్చి స్పందన సంచిక ప్రత్యేక సావనీర్‌గా విడుదల చేస్తున్నాము. పాఠకులు ఆచార్య ఆరార్కే గారి పరిచర్యల ద్వారా మీరు దీవించబడిన విషయాన్ని సాక్ష్యాలుగా వ్రాసి పంప వచ్చును. మీ సాక్ష్యాలతో పాటు ఆరార్కే గారితో మీరు తీయించుకున్న ఫోటోలు ఏవైనా ఉంటే వాటిని పంపండి, ప్రచురిస్తాము. అలాగే ఈ సావనీర్‌లో ప్రకటనలు, శుభాకాంక్షలు ఇవ్వాలని ఆశించే వారు క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించండి. లేదా స్పందన ఆఫీసుకు ఉత్తరం రాయండి.**

డా॥ దేవ గారు - **9490113300**, బ్ర. డేవిడ్ గారు - **9440280158**
బ్ర. ఎఫ్రాయిం గారు - **9290538233**, రెవ. కె. జాన్ మోజెస్ గారు - **9247557195**, పా॥ యేసుపాదాలు గారు - **9440302085**
బ్ర. నాగేశ్వరావు గారు - **9440777925**,
పా॥ సురేశ్ గారు - **9247333055**

మరిన్ని వివరాలకు:

**ఆరార్కే బర్త్‌డే సావనీర్, స్పందన, పోస్టు బాక్స్ 415**
**విజయవాడ - 520002**



# స్వయం పరీక్ష



డా॥దేవసహాయం దండల

నిజాయితీగా జీవించాలనుకునే క్రైస్తవుడు తనను తాను ప్రశ్నించుకోవలసిన ఏడు ప్రశ్నలున్నాయి, దేవుని వాక్య వెలుగులో వాటికి పరిష్కారం కనుగొందాం.

### 1. తెలిసి ఏదైనా పాపం చేస్తున్నానా?

"నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసిన యెడల ప్రభువు నా మనవి వినకపోవును." కీర్తన 66:18. నా హృదయంలో పాపాన్ని దాచుకొని ప్రార్థన చేస్తే, దేవుడు నా ప్రార్థనకు ఎంత మాత్రమూ జవాబు యివ్వడు.

తెలిసిన పాపం అంటే ఏమిటి? హెబ్రీ 12:1 లో చెప్పబడిన సుళువుగా చిక్కుల బెట్టు పాపమన్నమాట. కొంత కాలంగా ఏదో పాపానికి నీవు లొంగి పోయావనుకో - అది ఏదైనా కానీ వెంటనే విడిచి పెట్టాలి. పాపం పెద్దగోడలా దేవుని ముఖాన్ని నీకు మరుగు చేస్తుంది. పాపమున్నచోట దేవునితో సహవాసం అసంభవం.

ప్రభువు నామమును ఒప్పుకొను ప్రతి వాడును దుర్నీతినుండి తొలగి పోవలెను. (2 తిమోతి 2:19), ఇది దేవుని ఆజ్ఞ. దేవుడు మనల్ను ఆమోదించాలంటే, తెలిసి చేస్తున్న ప్రతి పాపాన్ని విడిచిపెట్టాలి. పరిశుద్ధాత్మను దుఃఖపరిచే ప్రతి చెడు కార్యం నుండి మనం వైదొలగాలి. పాపంతో మన సంబంధం తెగతెంపులు చేసుకోని పక్షంలో క్రైస్తవునిగా దేవునిలో మనం ఎదగలేవు.

యేసుక్రీస్తు మన ప్రతిబంధకాన్ని త్రెంచివేసి, మనకు స్వేచ్ఛను ప్రసాదిస్తానని వాగ్దానం చేశాడు. ఆయన మనల్ని రక్షించటం మాత్రమే కాక, కాపాడుటకు కూడా సమర్థుడు. ఆయన ఆత్మ ద్వారా మనలో నివాసం చేస్తే, మనం ప్రతిపాపం విషయంలో విజయం సాధించగలం.

### 2. నేను దేవుని చిత్తానికి విధేయుడనై జీవిస్తున్నానా?

"మిమ్మును మీరు దేవునికి అప్పగించు కోండి" రోమా 6:13 నేను సంపూర్ణంగా లోబడివున్నానా? ఎన్నో సార్లు మనం

"సర్వచిత్తంబు నీదేనయ్యా" అంటూ పాట పాడుదాం. అయితే నీ పాట అర్ధవంతం, అనుభవపూర్వకమైనదేనా? దేవుడు ఎక్కడికి వెళ్ళమంటే అక్కడికి వెళ్తున్నానా? ఏం చెయ్యమంటే అది చేస్తున్నానా? లేదా నా యిష్టం నెరవేర్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నానా? క్రీస్తు కోసం నేను స్వార్ధాన్ని విసర్జించానా? యేసుక్రీస్తు నా యజమాని, ప్రభువుగా వున్నాడా?

దేవునికి విధేయులైన సంతానం కావాలి. మనం స్వార్ధంతో నిండివుంటే ఆయన మనల్ను వాడుకోడు. "బలులు అర్పించుట కంటే ఆజ్ఞ శిరసా వహించటం మంచిది" (1 సమూ 15:22) ఇశ్రాయేలు ప్రజలు తిరుగుబాటు చేసి నశించారు. మన నుంచి దేవుడు నిజాయితీ కోరుతున్నాడు.

దేవుడు మనల్ను వాడుకోవాలంటే ఆయన ఎక్కడికి పంపినా వెళ్లడానికి సిద్ధంగా వుండాలి. ఆయన మార్గంలో ఆయన చిత్తానుసారంగా నడవటం ఎంత సంతోషకరమైన విషయం! మనం చేయటానికి యిష్టపడని వాటిని చేపట్టమని దేవుడేమీ బలవంతం చెయ్యడు. ఆయన మన తండ్రి. ప్రేమతో మనల్ను శాంతికరమైన జలముల దగ్గరికి నడిపిస్తాడు. ఆయనకు ఆనందం కలిగించే వాటినే మన హృదయాలలో వుంచుతాడు. మన ప్రాణాత్మ శరీరాలు ఆయనకు చెందినవి. కనుక, వాటిని ఆయనకు పూర్తిగా లోబడరచమని అడుగుతున్నాడు. విధేయత లేకుండా దేవునితో సహవాసం అసంభవం.

## 3. నేను ప్రతిరోజూ ప్రార్ధనలో సమయం గడుపుతున్నానా?

ప్రార్ధన లేకుండా విజయమే లేదు. క్రైస్తవ జీవితం విజయవంతం కావాలంటే ప్రార్ధించాలి. నేను ప్రార్ధన నిర్లక్ష్యం చేస్తే నేను బలహీనుణ్ణి. "యెహోవా కొరకు ఎదురుచూచువారు నూతన బలము పొందుదురు" (యెషయా 40:31).

కనుక యిప్పుడు నన్ను నేను ప్రశ్నించుకోవాలి. నేను ప్రార్ధిస్తున్నానా? దేవునితో సంబంధం కలిగి వున్నానా? నేను ప్రార్ధనా పరుడినని దేవునికి తెలుసా? లేక నేను ఆయన్ను నిరుత్సాహపరచానా? ఆయన వచ్చినప్పుడు నేను నిద్రించటం చూడకుండా, యిప్పుడే ఆయనతో నా సమస్యను చక్కబెట్టుకుంటాను. ప్రతిరోజు ఉదయమే ప్రార్ధనతో ఆయన్ను ఎదుర్కొంటాను.

## 4. దేవుని వాక్కును నేను శ్రద్ధగా చదువుచున్నానా?

దేవుడు తన వాక్కు ద్వారా మనతో మాట్లాడుతాడు. నేను దేవుని వాక్కు చదవటం లేదంటే ఆయన స్వరం వినకుండా దేవుని సంబంధాన్ని తెంచివేసుకొంటున్నానన్న మాట. నేను దేవుని వాక్కు పఠించటానికి సమయం వెచ్చించకపోతే, నేను దారి తప్పానన్నమాట. దేవుడు మానవుడికిచ్చిన సందేశమే బైబిల్. నీవు ఆయన్ను ఎరిగి వుంటే తప్పక ఆయన వాక్కు పఠిస్తావు. ఆత్మకు బలమైన ఆహారం దేవుని వాక్కు. నేను బలంగా వుండాలంటే దేవుని వాక్కును ధ్యానించాలి.



## 5. నేను క్రీస్తును బహిరంగంగా ఒప్పుకుంటున్నానా?

"సాక్ష్యమిచ్చెద మనస్వామి యేసు దేవుడంచు సాక్ష్యమిచ్చెద" అని పాటయితే పాడుతాం కాని, ఆచరణలో పెట్టం. నాతో పనిచేసే వారితో, ప్రయాణం చేసేవారితో ప్రతి ఒక్కరితో యేసును గురించి మాట్లాడ గలను. రక్షణ లేని వారి విషయమైన చింత భారంతో నా హృదయం నిండివుంది. అయితే ఈ రోజు మాటేమిటి? నేను మొదటి ప్రేమను విడిచిపెట్టానా? నేను చల్లబడిపోయి అన్యమనస్కంగా వున్నానా? దేవుని అగ్ని నా హృదయంలో యిప్పుడు రగలడం లేదా?

## 6. నేను వర్ధిల్లిన కొలది దేవుని పనికి ధారాళంగా యిస్తున్నానా?

"ఇవ్వండి, అప్పుడు మీకు యివ్వబడుతుంది" (లూకా 6:38). మనం యిచ్చే కొద్దీ, దేవుడు మరి అధికంగా యిస్తాడు. ఎందుకంటే ఆయన ఏ మనిషికీ బాకీపడడు. ఇవ్వడంలో నీవు దేవున్నేమీ మించిపోలేవు. కనీసం పదోభాగమైనా దేవునిపనికోసం ప్రత్యేకించాలి. ఆ మీదట దేవుడు మనకు ఇచ్చినకొలది యివ్వాలి. అదే లెక్కలోకి వస్తుంది. పదోవంతు దేవునిది. అది యివ్వటం దేవునికిచ్చినట్టు కాదు. ఆపైన యిచ్చిందే.....దేవుని విషయంలో నీవు నమ్మకంగా వుంటే ఆయన నీ పట్ల నమ్మదగినవాడుగా వుంటాడు. ఈ రోజున అనేకులు దరిద్రగొట్టు స్థితిలో వుంటున్నారు. కారణమేమిటో తెలుసా? వీరు దేవుని సొమ్ము దొంగిలిస్తున్నారు. దొంగలు. "ఔదార్యము గలవారు పుష్టి నొందుదురు. నీళ్ళుపోయు వారికి నీళ్ళు పోయబడును." (సామె 11:25).

## 7. యేసుక్రీస్తు కోసం నేనేదైనా నిర్ధిష్టమైన పనిచేస్తున్నానా?

దేవుడు నన్ను వాడుకోవాలంటే నేను నా సాక్ష్యం పంచుకోవటానికి స్థలాన్ని, మనుష్యులను చూచుకోవాలి. నా ఇండ్లే ఆత్మల రక్షణకై పాటుపడే సంఘంగా మారాలి. నేను రక్షించబడ్డానంటే సేవ చెయ్యటానికే! నేను సేవ చెయ్యటం లేదంటే – ప్రభువు నాకిచ్చిన దర్శనానికి విధేయుణ్ణి కాలేదన్నమాట. "వెళ్ళండి, యేసును చాటండి."

కొంతమంది "మమ్మల్ను అడగలేదే" అని అవకాశం కోసం కనిపెట్టుకుని వుంటారు. వీరు గుడికి హాజరవుతారు. ఆరాధనలో పాల్గొంటారు. కాని ఎప్పుడూ సేవలో పాల్గొనాలని ఆలోచించరు. దమస్కు మార్గంలో క్రీస్తును కలుసుకున్న పౌలు "ప్రభువా, నన్నేం చేయమంటావు? అ.కార్య 9:6 అడిగాడు. క్రీస్తును ప్రేమించేవారు, క్రీస్తుతో జతపనివారుగా వుండాలి. (1 కొరింథి 3:9).

ప్రియమైన సహోదరీ! సహోదరుడా! దేవుని అంగీకారం, ఆమోదం పొందాలంటే ఈ ప్రశ్నలు మనల్ను మనం నిజాయితీగా ప్రశ్నించుకోవాలి. ప్రభువు వచ్చినప్పుడు సంపూర్ణ బహుమానం పొంది "భళా" నమ్మకమైన మంచిదాసుడా" అనే మెప్పు వినాలంటే, మనల్ను మనం పరిశీలించుకొని, దేవుని కోరిక మేరకు మనం జీవిస్తున్నామో లేదో చూచుకుందాం! దేవునికి స్తోత్రం!!!

# అమ్మా, నాన్నా ఏడవకండి !

ఇది చాలా రోజుల క్రిందట అమెరికాలో జరిగిన సంఘటన. జార్జిట్రుయెట్ అనే దైవ సేవకుడు ఆదివారం గుడిలో చిన్నపిల్లలకు దేవుని వాక్యం బోధించాడు. తరువాత ఎవరైనా యేసుక్రీస్తును నమ్ముకోవాలంటే యిప్పుడే మీ అంగీకారం తెలియచెయ్యండి. మీ కోసం ప్రార్ధన చేస్తాం అని ఆహ్వానించాడు. ఆ రోజు 70 మంది బాలబాలికలు యేసయ్యకు తమ హృదయాలను అర్పించారు. వారిలో చాలా మంది అదే సంఘంలో సభ్యులైనారు. పాస్టర్ గారు తన పనుల మీద తాను వున్నాడు.

ఒకరోజు తనకు హాస్పటల్‌నుండి టెలిఫోన్ వచ్చింది. జబ్బుతో వున్న ఒక బాలిక తనను చూడాలని కోరింది. ఆ బాలిక పేరు నెల్లీ విషజ్వరంతో బాధపడుతుంది. ఆమె తల్లి దండ్రులు హాస్పటల్లో ఆ బాలికతో వున్నారు. పాస్టర్ గారు ఆ బాలికతో కలిసి ఆమెకోసం ప్రార్ధన చేశారు. పాస్టర్ వెళ్తూవుండగా ఆ బాలిక ఆయనను వెనక్కు పిలిచింది. ఈ బాలిక గత ఆదివారం రక్షింపబడిన ఆ 70 మందిలో ఒకరు.

"పాస్టర్ గారూ! నాకో సాయం చేస్తారా?" "ఏమిటి, ఏం చెయ్యాలో చెప్పమ్మా" "పాస్టర్ గారూ, వచ్చే ఆదివారం ఆదివారపు బడికి వెళ్ళినప్పుడు నేను అక్కడ లేకపోతే దయచేసి నా మాటగా యిలా చెప్పండి. నేను యేసు క్రీస్తును నమ్ముకున్నాను గనుక నా కేమీ భయం లేదు. అందరూ నా కోసం ప్రార్ధన చేయమని చెప్పండి.

ఆదివారం పాస్టర్ జార్జి గారు గుడికి వెళ్ళారు. ఆ బాలిక చెప్పిన మాటలు పిల్ల లందరికీ చెప్పాడు. మరుసటి వారం అంటే శనివారం మరొకసారి వచ్చింది. నెల్లీ తల్లి దండ్రులు పాస్టర్ గారిని చూడాలని చెప్పారు. బాలిక కాళ్ల దగ్గర తల్లిదండ్రులు నిలబడి ఏడుస్తున్నారు. నెల్లీ నీరసంగా పడుకొని వుంది. కళ్ళుమూసుకొని వుంది. ముఖం పాలిపోయి చనిపోవటానికి సిద్దంగా వున్నట్లనిపించింది. పాస్టర్ గారు తల్లిదండ్రులతో నెమ్మదిగా మాట్లాడుతున్నాడు. కొద్ది సేపటికి బాలిక కండ్లు తెరిచింది. తల్లి తండ్రులు ఏడుస్తూ వుండటం గమనించింది. ఎండిపోయిన పెదవులను తడిచేసుకుంటూ మెల్లని స్వరంతో అడిగింది. "ఎందుకు మీరు ఏడ్చేది?"

పాస్టర్ గారు ఆ బాలికతో "నీవు వారిని విడిచిపెట్టి వెళ్తున్నావు. యేసు క్రీస్తుతో వుండటానికి వెళ్తున్నావు." అన్నాడు. ఆ మాట అర్ధం చేసుకోటానికి కొద్ది సమయం పట్టింది.

"అంటే నేను చనిపోతున్నానా?" అడిగిందా బాలిక. "అవునమ్మ, అమ్మా, నాన్నలను విడిచి పరలోకానికి వెళ్తున్నావు." పాస్టర్ గారు బదులు చెప్పారు.

బాలిక కళ్లు మూసుకుంది. కొద్దిసేపు ఏదో కలవరించింది. ఆలోచించింది. తరువాత చిరునవ్వుతో లేవటానికి ప్రయత్నిస్తూ – "నేనేం భయపడటం లేదు. నేను యేసుక్రీస్తును నమ్ముకున్నాను. అమ్మా, నాన్నా ఏడవకండి. నేను యేసయ్యదగ్గరికి వెళ్ళగానే మీరు ఆయన్ను గురించి ఎంత చెప్పారో ఆయనను ప్రేమించ డానికి ఎలా నేర్పించారో చెబుతాను. మీ కోసం నేను ఎదురుచూస్తూ వుంటాను. నాన్నా, అమ్మా ఏడవకండి.

ఆ బాలిక అలాగే తల్లిదండ్రులను ఓదారుస్తూ వుంది. అలా కొన్ని నిమిషాలు దొర్లిపోయాయి. బాలిక ముఖం యింకా బాగా పాలిపోయింది. పాస్టర్ జార్జి వైపు తిరిగింది. ఆయన ఆమె చెప్పేది వినటానికి మంచం దగ్గర మోకాళ్ళూనాడు. ఆమె ఏదో చెప్పాలనుకుంది.

"పాస్టర్ గారూ, వచ్చే వారం నేను సండేస్కూల్‌లో వుండను గదా! మీరు వెళ్తే నేను అక్కడ కనపడను గదా!"

"అవును, నీవు యేసుక్రీస్తు సూపరెంటెండెంట్‌గా, దేవదూతలు ఉపాధ్యాయులుగా వుండే స్కూలులో వుంటావమ్మా."

"నేనెక్కడున్నానో పిల్లలందరికీ చెబుతాను గదా! నేను యేసు క్రీస్తును నమ్మాను. గనుక, నేనేమి భయపడలేదని చెప్పండి. అందరూ యేసు ప్రభువును నమ్ముకుంటే వారు మరణించినప్పుడు నాలాగా ధైర్యంగా వుండగలరని నా మాటగా చెప్పండి.

అదే, నెల్లీ యిచ్చిన చివరి సందేశం. బాలలూ! చూచారా! ఆ చిన్న బాలిక యేసయ్యను నమ్మింది. కనుక, మరణంలో కూడా ధైర్యంగా వుండగలిగింది. ఈ రోజే యేసు స్వామిని మీ హృదయాలలోకి ఆహ్వానించండి. అప్పుడు మీరు దేవుని పిల్లలవుతారు!




## శుభవార్త ఛానల్‌లో
## స్పందన ఆధ్యాత్మిక కార్యక్రమాలు

శుభవార్త, తొలి తెలుగు క్రిష్టియన్ ఛానల్

**దేవుని మహాకృపను బట్టి తెలుగు ప్రజల ఆధ్యాత్మిక ఆశీర్వాదాల కోసం 24 గంటలూ తెలుగు భాషలో దేవుని వాక్యాన్ని, దేవుని పాటలను వీక్షించటానికి, వినటానికి ఒక మంచి అవకాశం దేవుడనుగ్రహించాడు. చాలా కాలం క్రితం స్పందన పత్రికలో ప్రచురించిన విధంగా ఈ మధ్యనే ఈ ఛానల్ ప్రారంభమయింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనేకమంది ప్రముఖులయిన దేవుని సేవకులు దేవుని వాక్యాన్ని అందిస్తున్నారు. దైవజనులు ఆరార్కే మూర్తి గారు ప్రతి ఉదయం, సాయంత్రం శుభవార్త ఛానల్‌లో మాట్లాడుతున్నారు. అలాగే ప్రతి ఆదివారం సా॥ 5గం. నుండి 5.30 వరకూ 'స్పందన' ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రసారం చేయబడుతున్నాయి. వీక్షించండి. ఈ కార్యక్రమాల కోసం ప్రార్ధించండి. అనేకులకు పరిచయం చేయండి.**

సాక్షి జీవితాలు

# క్రీస్తుకు సాక్షిగా

శ్రీమతి జి.విజయకుమారి

నా పేరు - జి. విజయకుమారి. మా ఊరు - పోతవరం, మా అమ్మగారిది జేగురుపాడు గ్రామం. నేను వైశ్యకులం నుండి రక్షించబడినాను. నాకు 1981 లో పోతవరం గ్రామం గుళ్లపూడి రామకృష్ణ గారితో వివాహం జరిగింది. 1989 లో నేను ప్రభువు గురించి తెలుసుకోవడం జరిగింది.

వివాహం జరిగిన ఎనిమిది సంవత్సరాలైన నాకు పిల్లలు కలుగలేదు. పిల్లల గురించి నేను అనేక హాస్పటల్స్ తిరిగినా నాకు ప్రయోజనం లేకపోయింది. పిల్లల గురించి లేబర్‌స్కోప్ ఆపరేషన్స్ చేశారు. అయిన నాకు ప్రయోజనం లేకపోయింది. ముదునూరుపాడు స్వస్థతశాలకు వెళ్లడం జరిగింది. అందరివలె స్వస్థతల కోసం, పిల్లలకోసం కాకుండా నీలో ఉన్న ప్రత్యేకత నాకు కావాలని దేవుని సన్నిధిలో అడగడం జరిగింది. 21 వారములు గడిచేసరికి ప్రభువును గురించి పూర్తిగా తెలుసుకోవడం జరిగింది. నరకం నుంచి తప్పించగల రక్షకుడు యేసు అని ఆయన తప్ప వేరొక దేవుడు లేడని తెలుసుకోవడం జరిగింది. ఒక్కరోజు కూడా దేవుడిని విడిచి వుండలేని పరిస్థితికి వచ్చాను. ఇప్పుడు నాకు ఒక పరీక్ష ఎదురయ్యింది. పిల్లల్ని పొందలేని కారణంగా నా భర్త, అత్తగారు దేవుడిని విడిచిపెట్టమన్నారు. నాకు దేవుడిని విడిచిపెట్టడం ఇష్టంలేదు. నా భర్త నన్ను హింసించడం మొదలుపెట్టాడు. నేను కావాలా? నీకు దేవుడు కావాలా? అని అడిగాడు. దేవుడు కావాలంటే నేను ఉండను, నేను కావాలంటే దేవుడిని మరచిపోవాలని నన్ను చాలా బాధలు పెట్టారు. నేను భర్తను విడిచిపెట్టలేక దేవుడిని విడిచిపెట్టాను.

నా భర్త బలవంతం చేత నేను పూజలు చేస్తూ నా మనసులో యేసును ధ్యానించేదానిని. అలా చేయడం వలన నాకు ఏదో బలహీనత నాలో కలిగేది. **"నా కుమార్తె నా గాయములు రేపుచున్నావని ప్రభువు నాతో మాట్లాడడం జరిగింది."** అప్పుడు ప్రభువును కూడా నా మనసులో నుంచి తీసివేశాను. నా భర్తనే దేవుడిగా ప్రేమించేదానిని. నేను ప్రభువును మరచినా నా ప్రభువు నన్ను మరిచిపోలేదు.

1990 సం॥లో పిల్లల నిమిత్తం నాకు వైజాగ్‌లో పెద్ద ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్ సక్సెస్ అవడంతో ప్రతినెలా వైజాగ్ హాస్పటల్‌కు వెళ్ళవలసి వచ్చేది. 1992 సం॥లో జూలై నెలలో నాకు చాలా మరణాపాయ స్థితి ఎదురయ్యింది. ఇప్పుడు నేను మరణించినట్లయితే నా ఆత్మ ఎక్కడికి వెళుతుంది అనే ప్రశ్న నన్ను వేధించడం మొదలు పెట్టింది. రక్తప్రోక్షణ లేకుండా రక్షణలేదని బైబిల్ చెబుతుంది. హెబ్రీయులకు 9:22లో చెప్పబడినట్లుగా నేను ప్రభువును అంగీకరించలేని కారణంగా నరకానికి వెళ్లిపోవాలి. అక్కడ నిత్యము బాధపడాలి.

అందుకు యేసుప్రభువు నమ్ముకోవడానికి నా భర్త అనుమతి అడిగాను. అందుకు ఆయన అంగీకరించలేదు. నేను మరణాపాయస్థితిలో ఉండగా ఆయన నలుగురు హిందూ దేవుళ్లను గురించి చెప్పారు. వీరు ఎవరు? నా పాపాల కొరకు రక్తం చిందించలేదు. మరణించి తిరిగి లేవనూలేదు. కనుక వీరి ద్వారా మోక్షం లేదు. రక్షణ లేదు. కనుక యేసు ఒక్కడే నన్ను రక్షించేవాడని, నాకు నువ్వు కావాలి ప్రభువా నన్ను బ్రతికించుమని ప్రభువును వేడుకున్నాను. నా భర్త గురించి ప్రభువు నన్ను అడిగాడు. నీ భర్త వద్దన్నట్లయితే ఏం చేస్తావని ప్రభువు నన్ను ప్రశ్నించాడు. నా భర్తనైనా, నా ఆస్థినైనా ఏది అడ్డుగా వస్తే దానిని విడిచిపెడతాను. గాని ఇప్పుడు నీవు నన్ను బ్రతికించినట్లయితే నీ సాక్షిగా, నీ బిడ్డగా నేను జీవిస్తానని ఆ మరణాపాయ స్థితిలో నేను ప్రభువుతో నిబంధన చేసుకున్నాను. డాక్టర్లు సైతం బ్రతకనని చెప్పడంతో నా భర్త కూడా నన్ను నీ ఇష్టదేవుణ్ణి నమ్ముకోమని చెప్పాడు.

మరణాపాయ స్థితిలో ప్రభువుని ప్రార్థించి ఆయనతో నేను చేసుకున్న నిబంధనను బట్టి ప్రభువు నన్ను బ్రతికించాడు. తరువాత నేను ప్రభువుతో చేసిన నిబంధనను అశ్రద్ధ చేయడం వలన ఎటుచూచినా నాకు మరలా మరణం ఎదురయ్యింది. అప్పుడు ప్రభువును నా హృదయంలో చేర్చుకున్నాను. మరల నా భర్త - నేను కావాలా? దేవుడు కావాలా? అని నన్ను అడిగారు. అప్పుడు నేను మీరు కావాలి. దేవుడు కావాలని అన్నాను. దానికి నా భర్త అంగీకరించలేదు. దేవుడు నీకు కావాలని అంటున్నావు. గనుక నీవు నాకు వద్దని అన్నారు. నీవు దేవున్ని విడిచిపెడితే తన 30 లక్షల ఆస్తిని నాకిస్తానని చెప్పారు. **"ఒకడు లోకమంతయు సంపాదించి తన ప్రాణమును పోగొట్టుకున్న యెడల ఏమి లాభము"** అని బైబిల్ చెబుతుంది. కనుక నేను దేవునితో చేసి నిబంధన ప్రకారముగా నా భర్తను, నా ఆస్తిని విడిచి ప్రభువుని వెంబడించడానికి నిశ్చయించుకుని ఆ ప్రకారముగా ఇప్పుడు నేను జీవిస్తున్నాను.


నన్ను వదలించుకోవాలనే ఉద్దేశ్యంతో మతం అడ్డుపెట్టుకుని కోర్టుకు వెళ్లారు. నాకు లాయరు నోటీసు పంపించారు. మేము ఎంతమంది లాయర్ల వద్దకు వెళ్ళినా వారు ఒకేమాట చెప్పేవారు. న్యాయం అంతా మీ పక్షాన ఉన్నది. కనుక ఒక చిన్న అబద్ధం చెప్పమన్నారు. యేసుప్రభువు ఎవరో తెలియదని చెప్పినట్లయితే సగం ఆస్థి నాకు ఇప్పిస్తామన్నారు. యేసును ఇప్పుడు నేను ఎరుగనంటే పరలోకంలో యేసు నన్ను

ఎరుగనంటారు. అబద్ధికులును, విగ్రహారాధి కులు నిత్యనరకంలో పడుదురు. **ప్రకటన 21:8వ** వచనం ప్రకారంగా బైబిల్ చెబుతుంది. అందుకు లాయరు నీకు పిల్లలు కూడా లేరు. నీవు ఎలా బ్రతుకుతావని వారంతా నన్ను ప్రశ్నించారు. నా ప్రభువే నన్న పోషిస్తాడని చెప్పాను.

నేను కోర్టుకు హాజరుకాగా కోర్టువారు వివాహ హక్కులను పునరుద్ధరించు కోవాలన్నారు. అందుకని మా అమ్మగారు పోతవరం తీసుకొని వెళ్లారు. అచ్చట మా అత్తగారు, బావగారు ప్రభువు మీద నమ్మకం వదలుకొని మేము చెప్పినట్లు ఉంటే స్నానం చేసి గుడిలో కొబ్బరికాయ కొట్టి ఇంట్లో అడుగుపెట్టమన్నారు. నేను ప్రభువుని నమ్ముకొన్న కారణంగా ఆ పని చేయలేక తిరిగి మా అమ్మగారి ఊరు జేగురుపాడు తిరిగి వచ్చేశాను.

నావలె నశించిపోతున్న అనేక ఆత్మలను రక్షించుట కొరకై దేవుడు ఒక మందిరమును, కట్టించుకొని, సేవా పరిచర్య నిమిత్తం తన వాక్యప్రకారం జీవించు నిమిత్తం దేవుడు తన కృపలో నన్ను నడిపించుకుంటున్నారు.

ప్రభువునందు ప్రియమైన సహోదరు లారా, నిజ రక్షకుడైన యేసయ్యను ప్రతి ఒక్కరి హృదయమునందు చేర్చుకొని ఆయన కొరకు జీవిస్తూ ఆయనలో సాగిపోయే కృప మన నిజదేవుడైన యేసుక్రీస్తు మన అందరికి దయచేయును గాక!




**ఈ రోజు స్పందన పరిచర్యల కోసం ప్రార్థించారా?**
స్పందన పత్రిక చదువుట ద్వారా మీరు పొందిన ఆశీర్వాదాలు ఇతరులు కూడా పొందేలాగా వారికి పత్రికను పరిచయం చేయండి. శాంపిల్ కాపీ కావాలంటే ఈ రోజే మాకు వ్రాయండి.



## నూతన సంవత్సరంలో
# తెరువబడిన ద్వారము

*ఇదిగో తలుపులు నీ యెదుట తీసియుంచి యున్నాను దానిని ఎవడును వేయనేరడు. (ప్రకటన 3:8)*



డా॥ జామి ఫ్రాన్సిస్

ఫిలదెల్ఫియాలో ఉన్న సంఘపు దూతకు వ్రాయుము అన్న మాటలు ప్రకటన గ్రంధము మూడవ అధ్యాయములోనివి. ప్రకటన గ్రంధములో వ్రాయబడిన ఏడు ఉత్తరములు చిన్నాసియాలోనున్న ఏడు సంఘములకు వ్రాయబడిన హెచ్చరిక ఆ సంఘములు ఎప్పుడు ఎవరివలన స్థాపించబడినవో తెలియకున్నను ఒకటవ శతాబ్ధములో స్థాపింపబడినట్లు తెలియుచున్నవి.

నీవు నా వాక్యము గైకొని నా నామము ఎరుగననలేదు. అన్న మాటలను పరిగణలోనికి తీసుకొన్న ఈ సంఘము (ఫిలదెల్ఫియా) దేవునికి లోబడి. వాక్యము కొంతవరకు అంగీకరించినట్లు తెలియుచున్నది. John Heading అనే వేదాంత పండితుడు. నూతన నిబంధనా సంఘములను గురించి వివరించుచు. తన ఆధ్యయనములో కనుగొనిన కొన్ని సంఘతులను మనకు తెలియపరచుచున్నాడు.

ఫిలదెల్ఫియా సంఘము అపోస్తులుడైన పౌలుగారి యొక్క మూడవ సువార్త ప్రయాణములో కనుగొనట్లును ఎఫెస్సులో తాను ఉన్నసందర్భములో పిలదెల్ఫియ సంఘము విషయమై ఎటువంటి నిందలు లేకుండా (No Criticisms) ఉండినట్లు తెలియపరచుచున్నాడు. ప్రవచనాను సారమైన విషయమును చూచినట్లయితే. ఈ సంఘము మత భ్రష్టత్వము (Abostasy) ను విడిచి సత్యసువార్తకు స్పందించినట్లుగా తెలుపబడి యున్నది. యూదా ఆచారములకు పద్ధతులకు ఈ సంఘము దూరంగా ఉంటూ, విశ్వాస సంబంధమైన మంచి పోరాటము సాగిస్తూ క్రియల ద్వారా విశ్వాస సంబందమైన మంచి పోరాటము సాగించుచు క్రియలద్వారా విశ్వాస తీర్మానంపై కట్టబడి. బహుమాన దినం కొరకు ఎదురు చూస్తున్నట్లుగా తెలుపబడుచున్నది. (వాక్య ఆధారములు అపో.కా. 15:10; 2 తిమోతి 1:15; ప్రకటన1:9-20; 3:7-13).

**జీవితయాత్ర :**

క్రైస్తవ జీవితయాత్ర ఒక యాత్రికుని ప్రయాణమును పోలియున్నది. అనేక ద్వారములగుండా ప్రయాణం చేయవలసి యున్నది. పరిశుద్ధ గ్రంధములో అనేక

మార్గములు మూయబడినట్లును. అవి తెరువబడవలెనని ప్రయత్నించినను తెరువ బడలేదు. ఏదేను వనము యొక్క ద్వారము దేవుడు మూసివేసి అగ్ని జ్వాలలు వంటి ఖడ్గములతో ద్వారపాలకులను దేవుడే ఏర్పాటుచేసెను. అవి నేటికిని తెరువబడలేదు. జల ప్రళయములో నోవహు యొక్క ఓడ తలుపులు దేవుడే మూసివేసెను. దానిని తెరువ డానికి ఎవరికి సాధ్యం కాదు. (ఆది 7:16).

**రక్షణద్వారం :**

పాత నిబంధన కాలములో ద్వారములు ఆయాసమయములలో మూయబడినట్లు చూడగలము. అందుచేత అనేకులు ఆత్మీయ ఆనందమును సంపాదించుకొనలేకపోయారు. నీ,నా, పాపములను భరించుటకు మన రక్షకుడైన క్రీస్తు మానవునిగా జన్మించి ముప్పది మూడున్నర సంవత్సరములు ఈ భూమిపై నివసించి జనన మరణ పునరుత్థానముల ద్వారా పాపికి ద్వారములు తెరచి పాపికి రక్షణ మార్గమును చూపించిన ధన్యజీవి. సిలువ మరణము ద్వారా మనకీ రక్షణ మార్గమును తెరచినాడు. అన్యుల కొరకు తెరువబడిన ద్వారము క్రీస్తు సిలువ. మరణము ద్వారా ధర్మశాస్త్రమును తన శరీరమునందు కొట్టివేయుట చేత మధ్యగోడను పడగొట్టి యూదుల కొరకే కాకుండా అన్యులను రక్షించుటకు ద్వారము తెరువబడినది.

**తాళపుచెవి :**


ప్రవక్త అయిన యెషయా "ఒక వ్యక్తి భుజములపై దావీదు ఇంటి తాళపు చెవిని భారము మోసుకొని వచ్చునని ప్రభోదించెను. ఎవరా వ్యక్తి అని కాగడా పెట్టి వెదికి చూస్తే పాత నిబంధనలో కానరాదు. "నేను దావీదు ఇంటి తాళపు చెవిని అధికార భారమును అతని భుజములపై ఉంచెదను." (యెషయా 22:22) క్రొత్తనిబంధనలో ఆ వ్యక్తి మనకు లభించెను. రెండు వేల సంవత్సరములకు పూర్వము దావీదు తాళపు చెవిని తన భుజములపై వేసుకొని మూసి వేసిన ద్వారమును తీయుటకు ముందుకు సాగుచున్న వ్యక్తిని మనం చూడగలం. మానవులు చేసిన పాపములను మోపుగా తన భుజములపై పెట్టుకొని. యెరుషలేము వీధుల గుండా వెళ్లుచున్న వ్యక్తి ఎవరో కాదు మన రక్షకుడును ప్రభువునైన క్రీస్తు. ఆ తాళపు చెవి భారమైన సిలువయే.

మన ప్రభువు మన కొరకు చేసిన త్యాగమును ఎరిగి ఉత్తమమైన మార్గములో ప్రవేశించుటకు ద్వారమును తెరచెను. ఓ ప్రియ విశ్వాసి ఈ సత్యమును తెలుసుకొని ఇతరులకు నీ చేతనైనంతవరకు రక్షణ మార్గమునకు త్రోవ చూపుము. దక్షిణ దిక్కునుండి యెరూషలేము మీదుగా గాజాకు పోవు ఎడారి మార్గమున ప్రయాణము చేయుచున్న నపుంసకుడు ప్రవక్తయైన యెషయా వ్రాసిన ప్రవచనముల బాటను సమీపించి సతమత మవుచున్న సమయమున ఫిలిప్పు పరుగు పరుగున వెళ్ళి సత్యములను బోధించి ఎడారి ప్రయాణము ముగించుకొని. నీరు పారుచున్న స్థలమును ఆశ్రయించిన మరుక్షణంలోనే. ఎడారివంటి నపుంసకుని జీవితాన్ని నిత్యము ప్రవహించే జీవజలమార్గమునకు దారి చూపించి, నీటి బాప్తీస్మము ద్వారా పరలోక ద్వారమున ప్రవేశపెట్టాడు. (అపో.కా. 8:26-36).



మానవ రక్షణార్ధము ఒక్క పాపి నశించ కుండా ఉండాలని పవిత్ర రక్తమును చిందించి రక్షణ ద్వారము తెరిచాడు. సమయమును సద్వినియోగం చేసుకో. ప్రభువు తన రక్షణ ద్వారమును తెరచి సిలుపైనున్న దొంగను రక్షించెను. సుంకపు మెట్టువద్ద నున్న మత్తయిని పిలిచిన దేవుడు, చేపలు పట్టు జాలరులను మనుష్యులను పట్టు జాలరులుగా చేసిన దేవుడు మేడి చెట్టుపైనున్న జక్కయ్యను పేరు పెట్టి పిలిచి. అబ్రహాము కుమారునిగా తీర్చిదిద్ది రక్షణ ద్వారమును తన గృహమునకు తెరచిన ఆ యేసు ప్రభువు. తన మరణం ద్వారా తన గృహమునకు ఆత్మీయ తలుపులు తెరువబడినట్లు సార్వత్రిక సంఘమునకు స్వాతంత్ర్యము ఇవ్వబడినది. జర్మని దేశమునందు మార్టిన్ లూథర్ ప్రాన్సునందు కాల్విన్ మత స్వాతంత్రమునకై పోరాడిరి. వారి కృషిఫలితమే దైవ గ్రంధము చదువుకొనడానికి ద్వారము తెరువబడినది.

సర్వసృష్టికిని సువార్త ప్రకటించాలి అని మార్కు 16:15లో మన ప్రభువు శిష్యులతో చెప్పిన మాటద్వారా సువార్త సేవకు ద్వారము తెరచెను. మన అందరిపైన ఈ భారం నీవు నిజముగా గ్రహించుచున్నావా? మీ కుటుంబము సేవ అనే ద్వారమున ప్రవేశించియున్నారా? మీ సంఘము ఈ పరిచర్యలో సాగుచున్నదా. సువార్త ద్వారము గుండా అనేక మందికి రక్షణ సువార్తలో పాలు పొందునట్లు ప్రభువుయొక్క సంకల్పమును జ్ఞాపకం చేసుకొని ఆ ద్వారములోను ప్రవేశించి కృతజ్ఞతా స్తుతులు చెల్లిస్తూ ఈ దివ్య పరిచర్యలో పాల్గొని దైవ దేవుని దీవెలను ఆశిద్దాం...




## పుస్తక పరిచయం

**ప్రఖ్యాత రేడియో ప్రసంగికులు, ఆచార్య ఆరార్కే గారు, డా॥దేవసహాయం గారి పరిచయ వాక్కులతో దైవ సేవకులు కె.పరమానందం గారు రచించిన గ్రంథం**

**"దైవ సందేశాలు"**

ఈ సందేశాలు దైవసేవకులకు, యౌవనులకు ఎంతో ఆశీర్వాదకరంగా వుంటాయి.
నేడే మీ కాపీ తెప్పించుకోండి.

పేజీలు : 80
వెల : 20/- రూ॥లు
పోస్టేజీ : 5/- రూ॥లు

యం.ఓ. పంపాల్సిన అడ్రస్
**బ్రదర్ కె.పరమానందం**
**పోకూరివారి వీధి, ఐతానగర్,**
**తెనాలి, గుంటూరు జిల్లా.**
**ఫోన్: 08644-221521**

యెడతెగక ప్రార్థన చేయుడి. *1 థెస్స 5:16*

# ప్రార్థన వేదిక

**1.ఎస్.జ్యోతి- మచిలిపట్నం**
జెస్సి (బ్లడ్‌క్యాన్సర్) ఆరోగ్యం కోసం

**2.యు.ప్రేమకుమారి-గుంటూరు**
సుఖఃప్రసవం కోసం

**3.వై. రోజిపార్వతమ్మ-కడప**
నా నలుగురి కుమార్తెల కోసం

**4.జె. అబ్రహాం- పాములపాడు(పోస్టు)**
ఋణ సమస్యల నుండి విడుదల కోసం

**5.కె.లక్ష్మినరసమ్మ- జంగారెడ్డిగూడెం**
ఎ. కిరణ్‌కుమార్ ఉద్యోగం కోసం

**6.పొత్తూరి మత్తయ్య- కారంచెడు**
**కుమార్తె ఆరోగ్యం(ఫిట్స్) కోసం**

**7.ఎస్.సుగుణమ్మ- యర్రగుంట్ల**
కుమారుడు జీవయ్య ఆరోగ్యం కోసం

**8.యం.ఎస్.హర్షవదన- అనంతపూర్**
చిన్న కుమార్తె సుఖఃప్రసవం కోసం

**9.యం.దేవమ్మ- కర్నూలు**
నా ఆరోగ్యం కోసం

**10. సుజాత- ముంబాయి**
కుమారులు ఫ్రెడరిక్, హానోక్‌ల కోసం

**11.జె. పరిమళ- చల్లపల్లి**
మా సమస్యల కోసం

**12.కె. గ్రేస్ విలియమ్- సికింద్రాబాద్**
నా ఆరోగ్యం కోసం

13.కె. **అంజలి సతీష్- నర్సాపూర్**
గర్భఫలం కోసం

**14.టి. జయలక్ష్మి- నెల్లూరు**
శివప్రసాద్ ఉద్యోగం కోసం

**15.యం. బర్నబాస్-రేలంగి**
తల్లిగారి ఆరోగ్యం కోసం

**16. కె.అంబ్రోస్- మార్కపుర్**
**భార్యభర్తలిరువురి ఆరోగ్యముల కోసం**

**17.జి.ఎస్.బాబు- విశాఖపట్నం**
ప్రశాంత్ ఆరోగ్యం (ఫిట్స్) కోసం

**18.యం. ప్రదీప్- తణుకు**
**నా సమస్యల కోసం**

**19.**వి.యం. **రాజ్‌కుమార్-విజయనగరం**
నా ప్రమోషన్ కోసం

***20.*పి.వి.దేవకరుణమ్మ-చీమకుర్తి**
భార్యభర్తలిరువురి ఆరోగ్యముల కోసం

***21.* బి. సుబ్బారావు- ఏలేశ్వరం**
**అమ్మాజి ఆరోగ్యం కోసం**

***22.* నాగురి సుందరావు- ఒంగోలు**
**నా ఆరోగ్యం (బి.పి) కోసం**

**23.యల్. ఎస్తేరు స్వర్ణలత- సికింద్రబాద్**
**మా కుటుంబము కోసం**

**24. పాలేటి వీరయ్య- గుంటూరు**
**చాణక్య వివాహం కొరకు**

**25.హేమలతజార్జి- హైదారబాద్**
**కుమార్తె వివాహం కోసం**

**26. రాధిక జోసఫ్- విజయవాడ**
**నా ఆరోగ్యం కోసం**

**27. యం. జాన్‌రావు- నూజివీడు**
**పిల్లల చదువుల కొరకు**

**28.జి.ఎ.రత్నబెనర్జి- కాకినాడ**
**ఎంసెట్ ఎగ్జామ్స్ కోసం**

**29.జి. గోలియ్య- మలకపల్లి(పోస్టు)**
**నా ఆరోగ్యం కోసం**

**30.యన్. జాన్‌బాబు- హింధుపూర్**
**కుటుంబ శాంతి, సమాధానము కొరకు**



బోధించే వారి కోసం క్లుప్త ప్రసంగాలు

# "దైవ నరావతార అవశ్యకత"

**రెవ.కె.జాన్ మోజెస్**

***యేసు అందరికీ రక్షకుడు. ఈ రక్షణ వార్త మానవ కోటికి శుభవర్తమానాలు.***

| | | |
|---|---|---|
| 1. | రక్షణ శుభవార్త | 1కొరింథీ 15:12 |
| 2. | సమాధాన శుభవార్త | ఎఫెసీ 6:15 |
| 3. | క్రీస్తును గూర్చిన శుభవార్త | రోమా 1:7 |
| 4. | రాజ్య శుభవార్త | మత్తయి 9:35 |
| 5. | దేవుని రాజ్య శుభవార్త | మత్తయి 4:23 |
| 6. | దేవకుమారుని శుభవార్త | మార్కు 1:1 |
| 7. | కృపా శుభవార్త | అపో ॥కార్య. 20:24 |
| 8. | మహిమ శుభవార్త | 2 కొరింథి 4:4 |
| 9. | నిత్య శుభవార్త | ప్రకటన 14:6 |

**క్రీస్తు దివినుండి భువికి రావడానికి కారణములు**

| | | |
|---|---|---|
| 1. | పాపులను రక్షించడానికి | 1 తిమోతి 1:15 |
| 2. | లోకమును రక్షించుటకు | యోహాను 12:47 |
| 3. | నశించిన దానిని వెదకి రక్షించటానికి | లూకా 19:10 |
| 4. | పరిచారము చేయుటకు | మార్కు 10:45 |
| 5. | విమోచన క్రయధనంగా | మత్తయి 20:28 |
| 6. | అపవాది క్రియలు లయపర్చుటకు | 1 యోహాను 3:8 |
| 7. | తండ్రి చిత్తము నెరవేర్చుటకు | యోహాను 6:38 |
| 8. | ప్రవక్తల ప్రవచనాలు నెరవేర్చడానికి | మత్తయి 5:1 |
| 9. | గొర్రెలకు సమృద్ధి జీవం ఇవ్వడానికి | యోహాను 10:10 |
| 10. | పాపములను తీసివేయడానికి | 1యోహాను 3:5 |
| 11. | చూడని వారు చూచుటకు | యోహాను 9:35 |
| 12. | దాస్యము నుండి విడిపించడానికి | హెబ్రీ 12:49 |
| 13. | భూమిపై అగ్ని వేయడానికి | లూకా 12:49 |
| 14. | భేదమును కలుగజేయడానికి | లూకా 12:51 |

ప్రపంచ ప్రఖ్యాత గాంచిన భక్తుల ప్రసంగాలు

# అంతిమ గురి

పాల్ యాంగీచో

మనిషన్న తరువాత ప్రతి ఒక్కరికి జీవితంలో ఏవో ఆశయాలు, గురి వుండి తీరతాయి. అవి పెద్దవి కావచ్చు. చిన్నవి కావచ్చు. ఆ ఆశయ సాధన కోసం మనిషి నిరంతరమూ కృషి సల్పుతూనే వుంటాడు. ఇంతకూ మనిషి సాధించాలనుకునే ఆశయాలేమిటి? – పదవి కావచ్చు, భౌతిక వస్తువాహనాలు కావచ్చు. పేరు ప్రఖ్యాతులు, ధనధాన్యాలు ఆధ్యాత్మికమైన ప్రగతి, డబ్బు ఇలా ఎన్నయినా చెప్పుకుంటూ పోవచ్చు. ఒక మనిషి జీవితాశయాలను గురిని బట్టే అతడు ఎలాంటి వాడో చెప్పవచ్చు.

భూ సంబంధమైన ఆశయాలు సాధించవచ్చు. కొన్ని సార్లు అధిగమించవచ్చు కూడా! కాని, క్రైస్తవుల గురి మాత్రం మించిపోలేము. ఎందుకు? క్రైస్తవుడికి అంతిమ గురి పరలోకం. ప్రభువును ముఖాముఖిగా చూడటం, ఆయన నోరు తెరిచి "భళా నమ్మకమైన మంచి దాసుడా" అని చెప్పగా వినటం.

రాయబారి పౌలు ఫిలిప్పి 3:14 లో తన జీవితాశయం యిలా తెలియచేశాడు. "క్రీస్తు యేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానము పొందవలెనని గురియొద్దకే పరుగెత్తుచున్నాను."

"గురి" అంటే ఏమిటి? పరుగు పందెం చివరికి చేరటం గురి. గురి అనే పదానికి గ్రీకు భాషలో "స్కోపోస్" అనే మాట వుంది. దీని అర్థమేమిటంటే "కనిపెట్టేవాడు లేదా కాపలాదారుడు. దీనిని బట్టి ఏం తేలుతుందంటే ఒక వ్యక్తి తన దృష్టి ఏదో ఒకదాని మీద నిలిపి వుంచాలన్నమాట. ఫిలిప్పి 3:14లో దేవుని ఉన్నతమైన పిలుపులో కలిగే బహుమతి మీద దృష్టి నిలపాలని హెచ్చరించబడ్డాం. మానవుల విమోచన అనే అంతిమ గురి చేరటానికి యేసుప్రభువు ఎక్కిన కొన్ని పర్వతాలు పరిశీలిద్దాం.

**1. శోధన పర్వతం :**

యేసుప్రభువు యొర్దాను నీళ్ళలో బాప్తీస్మం పొందాడు. అదో అద్భుతమైన కార్యక్రమం. ప్రేమామయుడైన పరలోకపు తండ్రి కుమారుని గూర్చి "ఈయన నా ప్రియ కుమారుడు. ఈయనయందు ఆనందించు చున్నాను." దివ్యమైన ఈ అనుభవం తర్వాత యేసుప్రభువు 40 రోజులు శోధింపబడ్డాడు. ఈ శోధనలను ఎదుర్కోడానికి ప్రభువు ఉపయోగించిన పనిముట్లు చాలా శక్తిగలవి. శోధనలు బలమైనవే కాని దేవుని వాక్కు అంతకంటే శక్తిగలది. ప్రభువు శోధకుడితో ఎలా యుద్ధం చేశాడో చూడండి. "మనిషి రొట్టె వలన మాత్రమే జీవించడు"... అని రాయబడి వుంది. "నీ దేవుడైన యెహోవాను శోధించ వద్దు." అని రాసి వుంది. ఈ మాటలో దేవుని శక్తిని నీవు గ్రహించలేకున్నావా?

**2. ప్రబోధ పర్వతం:** (మత్తయి సువార్త 5వ అ.)

యేసుక్రీస్తు "పర్వతంపైకి ఎక్కిపోయి" తను ఎంపిక చేసుకున్న పన్నెండు మంది శిష్యులతో సహా యితర శిష్యులకు బోధించాడు. ఆచరణాత్మకం, వాగ్దానంతో కూడిన ఈ ప్రబోధాలను "పర్వత ప్రసంగం అంటారు. ప్రసంగాలన్నిటిలోకి శ్రేష్టమైన ఈ ప్రసంగం ధన్యులు, ధన్యులు అనే మాటతో ప్రారంభ మవుతుంది. ఇంగ్లీషులో BLESSED అని ప్రతి వచనానికి ముందు వస్తుంది. యేసుప్రభువు తను సిలువ మీద ఎలాంటి మరణం పొందవలసి వుందో తెలిసికూడా తన శ్రోతలను ప్రోత్సాహపరిచాడు, సంతోష పెట్టాడు.

**3. రూపాంతర పర్వతం:** (మత్తయి 26వ అ.)

యేసు ప్రభువు అపనమ్మికతో నిండివున్న శిష్యులకు తన మరణాన్ని గురించి వివరించాడు. పేతురు, యాకోబు, యోహానులు సంఘ నిర్మాణ కార్యక్రమంలో ప్రధాన పాత్ర వహిస్తారని ప్రభువు తన ముందెలివినిబట్టి గ్రహించాడు. అందుకే వారిని విశ్వాసంలో స్థిరపరచటానికి వారికి పరలోకాన్ని గురించిన దర్శనం కొద్దిగా చూపెట్టాడు. ఈ సమయంలోనే పరలోకపిత కుమారుణ్ణి గురించి ఇలా చెప్పాడు. "ఈయన నా ప్రియకుమారుడు, ఈయనయందు నేనానందిస్తున్నాను.

**4. పరీక్షా పర్వతం :** (మత్తయి 26వ అ.)

యేసు మరణించే సమయం ఆసన్నమైంది. పరిస్థితిని గ్రహించి ఆయన చింతాక్రాంతుడయ్యాడు. "ఆయన దుఃఖం, కలతచెందసాగాడు." (మత్తయి 26:37). గెత్సెమనే వనంలోఆయన తన తండ్రి సముఖంలో దుఃఖాక్రాంతుడయ్యాడు. "సాధ్యమైతే ఈ గిన్నె నా నుండి తొలగిపోనియ్యి" ఏది ఏమైనా ఆయన తండ్రి అభీష్టానికి తలవొగ్గాడు. ఆయన వేదనామయుడై వున్నప్పుడు దేవదూత వచ్చి ఆయనను బలపరిచినట్లు మీకా 22:43 చెబుతుంది. ఆయన వేదనతో ప్రార్థన చేయగా చెమట రక్తంగా మారి గొప్ప బిందువులుగా నేలను రాలాయి. లూకా 22:44 గొప్ప పరీక్షకు ముందు తీవ్రంగా చేసిన ప్రార్థన యిది.

**5. కన్నీటి పర్వతం :** (మత్తయి 27 వ అ.)

యేసు ఒంటరిగా పిలాతు ముందు నిలిచివున్నాడు. శిష్యులంతా ఆయన్ను విడిచిపోయారు. రాను రాను పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. పేతురు "యేసు ఎవరో నేనెరుగను" అనేశాడు. తను చేసింది త్వరలోనే పేతురు గ్రహించి "బిగ్గరగా ఏడ్చాడు."

యేసును ఎంతో హింసించారు. గొల్గొతా అనే కపాల స్థలానికి సిలువను మేకులతో కొట్టడానికి తీసుకుపోయారు. ఈ క్షణంలో పరలోకపు తండ్రి కూడా కావాలనే తన ముఖం ప్రక్కకు త్రిప్పుకొన్నాడు. 'నా దేవా, నా దేవా నన్నెందుకు చేయి విడిచావు" అని యేసు ఆక్రందన చేశాడు. మరలా ఆయన బిగ్గరగా కేకవేశాడు. అప్పుడు తన ఆత్మను అప్పగించాడు. యేసు మన విమోచన క్రయధనం చెల్లించాడు.

**6. విజయ పర్వతం :** (అపో॥కార్య 1)

యేసు తిరిగి వస్తానని శిష్యులకు మాట యిచ్చాడు. ఈ సత్యం క్రైస్తవులకు తమ అంతిమ గురి లేదా లక్ష్యం సాధించడానికి గొప్ప ప్రేరణ. స్వర్వసృష్టికి శుభవార్త ప్రకటించమనే గొప్ప ఆదేశం యిచ్చిన తర్వాత ఆయన కొనిపోబడ్డాడు. మేఘము ఆయనను కప్పివేసింది. కనుక ఆయన కనుమరుగైనాడు.

యేసు అంతిమ గురి నెరవేరింది. రక్షణ ప్రణాళిక ముగిసింది. నీవు నేను ఆయన రక్షణ అనుభవించునట్లు ఆయన తన ప్రశస్త రక్తాన్ని సిలువలో ధారపోశాడు. యిది కష్టతరమైనా యేసు తన లక్ష్యాన్ని సాధించాడు. అదే విమోచన కార్యం.

**ముగింపు :**

యేసుక్రీస్తు మన విశ్వాసానికి కర్త. దానిని వాడు కూడా ఆయనే. ఆయన తన ఎదుట వుంచబడిన ఆనందం కోసం అవమానాన్ని నిర్లక్ష్యపెట్టి సిలువను సహించి, దేవుని సింహాసనం కుడివైపు ఆసీనుడై యున్నాడు. మన అంతిమ గురి నెరవేర్చడంలో ఆయనే మనకు మార్గదర్శి.




**గిరిజనుల మధ్య జరిగే సేవా అద్భుతాలను చూడ్డానికి వేలాదిగా తరలిరండి.**






**27 వ పాఠము**

## యేసు క్రీస్తుకును పరిశుద్ధాత్మకును గల సంబంధము

*"ప్రభువు ఆత్మ నా మీద వున్నది. బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను. చెరలో నున్న వారికి విడుదలను, గ్రుడ్డి వారికి చూపును (కలుగునని) ప్రకటించుటకును, నలిగిన వారిని విడిపించుటకును ప్రభువు హితవత్సరమును ప్రకటించుటకును ఆయన నన్ను పంపియున్నాడు" లూకా 4:18,19.*

"దేవుడు నజరేయుడైన యేసును పరిశుద్ధాత్మతోను శక్తితోను అభిషేకించెను. దేవుడాయనకు తోడైయుండెను. గనుక ఆయన మేలు చేయుచు అపవాదిచేత పీడింపబడిన వారినందరిని స్వస్థపరచుచు సంచరించుచుండెను". అపో. 10:38. యేసు క్రీస్తు శరీరధారియై యీ లోకములో జీవించినప్పుడు ఆయన చేసిన కార్యములకును పరిశుద్ధాత్మకును అవినాభావ సంబంధమున్నది. తండ్రి కుడిపార్శ్వమున క్రీస్తు కూర్చుండునంత కాలము ఆయన పరిశుద్ధాత్మ ప్రముఖ పాత్ర వహించును. పరిశుద్ధాత్మకును క్రీస్తుకును గల సంబంధమును గూర్చిన బోధ చాలవరకు నాలుగు సువార్తలలో వ్రాయబడినది.

### 1.యేసుక్రీస్తు పుట్టుకలో పరిశుద్ధాత్మకు గల సంబంధము

1. యేసుక్రీస్తుకు సూచకుడగు స్నానికుడైన యోహాను పుట్టుక నుండి ఆత్మతో నింపబడి యుండెను. అపో. 1:15. ఒక కుమారుడు జన్మించునని వారికి బయలు పర్చబడినప్పుడు యోహాను తల్లిదండ్రులైన ఎలీసబేతు జెకర్యాలు పరిశుద్ధాత్మ పూర్ణులైరి. లూకా 1:41,67.

2. కన్యకయగు మరియ గర్భవతియై యేసు క్రీస్తును కనుట పరిశుద్ధాత్మ వలన కలిగినది. ఇది తన కుమారునికి శరీరము అమర్చుటలో దేవుడు చేసిన సృజనాత్మక అద్భుతమైయున్నది. లూకా 1:35, మత్త 1:20 హెబ్రీ 10:5.

### 2. యేసు క్రీస్తు యీ లోకములో చేసిన పరిచర్యలో పరిశుద్ధాత్మగల సంబంధము

1. యేసుక్రీస్తు బాప్తిస్మము పొంది, ప్రార్థించుచునప్పుడును పరిశుద్ధాత్మ పావురమువలె ఆయన మీద నిలిచెను. మత్త 3:16, మార్కు 1:10, లూకా 3:22,యోహాను 1:32,33.

2. ఈ లోకంలో నెరవేర్చవలసిన ప్రత్యేకమైన సేవ కొరకు దేవుడు తన కుమారుడైన క్రీస్తు యేసును పరిశుద్ధాత్మతో అభిషేకించెను. లూకా 4:18,19. అపో. 10:38. ఈ అభిషేకము యొక్క వుద్దేశమును యేసు యెరిగి యుండెను.

3. యేసుక్రీస్తు నెరవేర్చిన పరిచర్యలన్నిటి యందు పరిశుద్ధాత్ముడు ఆయనతో గూడ నుండెను. ఆత్మవలన ప్రేరేపింపబడి ఆయన ఆరణ్యములోకి వెళ్ళి అచ్చట సైతానుచే శోధింపబడెను. లూకా 4:1. ఆయన మరల పరిశుద్ధాత్మశక్తిచే నింపబడి తిరిగి వచ్చి బోధించ నారంభించెను. లూకా 4:14,15.

4. దేవుడు తన కుమారునికి (యేసు క్రీస్తుకు) కొలత లేకుండ ఆత్మను అనుగ్రహించెను కావున పరిశుద్ధాత్మలో లీనమై యుండి యేసు దేవుని మాటలే పలికెను.

5. యేసుక్రీస్తు ఆత్మశక్తిచేత దయ్యములను వెళ్ళగొట్టెను. మత్త 12:28.

6. యేసు క్రీస్తు పునరుత్థానుడై తన శిష్యుల కగుపడినప్పుడు పరిశుద్ధాత్మ ద్వారా ఆయన వారి కాజ్ఞాపించెను. అపో. 1:13.

7. పరిశుద్ధాత్మ వరమును గూర్చి యేసు క్రీస్తు తన శిష్యులకు వాగ్దానము చేసెను. లూకా 11:13. యోహాను 7:38,39; 14:16,17. క్లిష్ట పరిస్థితులలో యేమి మాట్లాడవలయునో బోధించుననియు, మాట్లాడునది ఆత్మయే గాని మీరుకాదనియు యేసు తన శిష్యులకభయమిచ్చుచున్నాడు.

### 3. యేసుక్రీస్తు మరణములోను పునరుత్థానములోను పరిశుద్ధాత్మకు గల సంబంధము

1. యేసు క్రీస్తు సిలువపై మరణించి, దేవునికి తన్ను తాను అర్పించుకొని నది నిత్యుడగు పరిశుద్ధాత్మ మూలముననే. హెబ్రీ 9:14.

2. పరిశుద్ధాత్మ మూలంగానే దేవుడు మృతులలో నుండి యేసు క్రీస్తును లేపెను. రోమా 8:11. ఈ పునరుత్థానం వలన యేసుక్రీస్తు పరిశుద్ధమైన ఆత్మనుబట్టి ప్రభావం చేత "దేవుని కుమారుని"గా నిరూపించబడిన వాడాయెను. రోమా 1:3,4:

### 4. మహిమ పర్చబడిన యేసుక్రీస్తుకును పరిశుద్ధాత్మకును గల సంబంధము

1. ఈ యుగములో పరిశుద్ధాత్మ రావలసియున్న యెడల యేసు క్రీస్తు మహిమ పరచబడవలసి యుండెను. యోహా 16:7.

2. క్రీస్తు హెచ్చింపబడిన తరువాత ఆయన యందు విశ్వాసముంచిన వారిపై పరిశుద్ధాత్మను కుమ్మరించి యున్నాడు. అపో. 2:33. తండ్రి నుండి వాగ్ధానమును పొందిన తరువాత పెంతెకోస్తు దినమున పరిశుద్ధాత్మను పంపెను.

3. ఈ యుగంలో పరిశుద్ధాత్మ క్రీస్తుకు సాక్షియైయున్నాడు. ఆయన శిష్యుల ద్వారా, వాక్యం ద్వారా ఆయన యిది జరిగించును. యోహా 15:26. అపో. 1:8. తన శిష్యులు పరిశుద్ధాత్మను పొందవలెనని క్రీస్తు యిచ్చ యించెను. యోహాను 20:21,22.

4. పరిశుద్ధాత్మ శిష్యులకు బోధించి, క్రీస్తువారితో చెప్పిన సంగతులన్నియు జ్ఞాపకం చేయును. యోహాను 14:26.

5. పరిశుద్ధాత్మ వచ్చుటలో గల మహోద్ధేశ్యవేమనగా ఆరోహణుడై, హెచ్చింపబడిన యేసు క్రీస్తును మహిమ పర్చుటయే. యోహాను 16:14.

---------



## జనవరి నెల గ.ను.క ఆల్‌కరెక్టుగా జవాబులు వ్రాసిన వారిపేర్లు

యాదల నిరీక్షణ కుమార్- ఇనమనమెళ్ళూరు, జంపా కోమలదేవి- విజయవాడ, బత్తుల ఆనీమేరి- హైదారబాద్, హెచ్.సరళమ్మ-గిద్దలూరు, యం. విజయ-ఎలూరు,కె.జె. మార్గరేట్ పద్మాకర్- గుత్తి, ఎస్.ఎఫ్.కస్తూరిభాయి,మదనపల్లె, డి. సుందరరాజన్- కుప్పం, ఆర్. జయమ్మలాబాను- గుంతకల్లు, కె. సురేష్‌బాబు-ఒంగోలు,పి.వి.తారాబాయి- మచిలిపట్నం, కె.సమూయేలు- తాడేపల్లిగూడెం, డి.ఎస్తేరువిజయప్రసాద్-అనంతపురం,కె.ఇమ్మానుయేలు- ఖమ్మం, టి.సుగుణమార్కు-శాయింపేట, టి.ఎ.భాస్కరరావు-తడ, డి.సామ్యుల్-తిరువళ్ళూరు, యం.మేరి-కోటపాడు, యం.సి.మనోహరమ్మ-అనంతపురం, హెచ్.ఫ్లొరెన్సమ్మ- చిన్నదోర్నాల,ఫెయిత్ రాజామణి-జమ్మలమడుగు, యం.ఝాన్సీ శాంతకుమార్- హన్మకొండ, జె.యస్.రాజశ్రీ చంద్రమణి-కుప్పం, సిహెచ్. రూతు- తిరుమేళ్ళ, జి.కె.యల్. సుగుణమ్మ- బద్వేల్, యన్. అరుణకుమారి-గిద్దలూరు, సి. హెచ్.కస్తూరిభాయి -చీరాల, ఐ.జెర్మయ-ఖమ్మం, వి.బ్యూలా గాబ్రియేల్-విజయవాడ, బి. యెషయా- జమ్మలమడుగు,టి. సువర్ణరాజరత్నం-కడప,వి.బి.లక్ష్మి-గోపాలపట్నం, సునంద యేసుపాదం-మదనపల్లి, జి.పాల్, జి.రిబకమ్మ-కలశపాడు,యం.సంపతిజాన్‌పీటర్-పర్మాల, జి.భారతి ఆంద్రూస్-మార్కాపురం, కె. విమల-హైదారబాద్, వి.ఎఫ్.జయలక్ష్మి సిల్వరాజ్ -చీరాల, కె. భారతిదేవప్రియం-కడప, జె. ప్రసాదరావు- గోకవరం,

ఒక్క తప్పుతో వ్రాసినవారు: వి. జడ్సన్- అమీనపురం, వై. మాణిక్యం,కె.శెశీల్య,వై. ఎస్తేరమ్మ- కంచికచర్ల, కొండ్రు మేరిగోల్డ్- ఒంగోలు,టి. శోభారాణి-హన్మకొండ,ఎస్. జాషువా మాత్యూన్-ఒంగోలు, ఎ. మునిరాజు-కడప, టి. శాంతిరత్నం-ఏలూరు, బి.కృపానందం-నర్సాపురం,సి. సులోచనమ్మ- జమ్మలమడుగు,కె. గ్రేసి విలియమ్-ఆనంద్‌బాగ్, జాయ్ బ్లెస్సి-కదిరి, కె.ప్రేమరూతు -గుంటూరు, జి.జి.పి.యం.నాని- దివికోడురు, కె. మేరిజ్ఞానభాయి-ఖమ్మం,బి. మాధవి అశోక్- పర్మాల, యం.స్వర్ణలత ఏంజల్-కర్నూలు,

### జనవరి గనుక జవాబులు

**అడ్డం :** 1.గోపురము 2. బంగారమును 6.క్తవప్ర(ప్రవక్త) 8. యుక్తమే9. ధికము 11. యాత 13.మోసము14. చేమజ (జమచే) 15. ముకయు (యుక్తము) 16.జత 17. లౌకిక 20. తూములు 22. నిరపరాధిని 25. నిజముగా 26. దేవసహాయము 28. బెయిలోతు 29. యుగ

**నిలువు :** 1. గోమేధికము 2.రక్తము 4. గాయు 5.రక్తముచేత 7. ప్రయాస 10. కనికరము, 12.యజమానునిగాను, 18.కినిలోయలో (లోయలోనికి) 19. మిదిము (ముదిమి) 20.తూర్పుదేశ, 1.లులేసబె(బెసలేలు), 23.పని, 24. రాజనియు, 27. హోయి

# యోవేలు

మనలో ప్రతి ఒక్కరికి మూడు దశలలో వయస్సు పరిణతి చెందుతూ ఉంటుంది. శిశువు, బాలుడు, యువకుడు. యువకుడైనప్పుడే ఒకవ్యక్తి తండ్రినుండి కుమారులకును, హక్కులు బాధ్యతలు స్వీకరిస్తాడు. మన ప్రభువు శిశువుగా జన్మించాడు. బాలుడుగా పండితులు గోష్టి సభలో తన పన్నెండో ఏట కూర్చున్నాడు. యువకుడుగా తండ్రినుండి కుమారత్వపు బాధ్యతలు స్వీకరించాడు. పాఠకులూ! మీరు మీ ఆధ్యాత్మిక వయస్సులో ఎదుగుతున్నారా? మీ వయస్సెంత? చిన్న పిల్లల్లరా, యువకులారా, తండ్రులారా, అంటూ భక్త యోహాను తన పత్రికలో మూడు వయో పరిమాణాలను ఉద్దేశించి సంబోధించాడు.

**ప్రార్థన :-**

పరిశుద్ద దేవా, కృపా సత్య సంపూర్ణుడవైన పరమ తండ్రీ, నీకు మా హృదయ పూర్వకమైన కృతజ్ఞతలు. అగ్ని జ్వాలలవంటి కన్నులు గల యేసూ, నీకు మరుగైనది ఏదీ లేదు. నీవు మా హృదయాలను, అంతరింద్రియాలను పరిశోధిస్తున్నావు. ప్రభుత్వము, మహిమ, ఆధిపత్యము నీకే చెందియున్నాయి దేవా! నీ రాజ్యము శాశ్వతమైనది. యుగయుగములు, యుగ, యుగాంతమువరకు నీవే రాజువు. సార్వభౌముడవు. నీవే నీతిగల న్యాయాధిపతివి దేవా! తండ్రీ ! మా పాఠకులను వారి కుటుంబములను, వారి సంతానములను సమృద్ధిగా దీవించండి. నీ సంఘములను, సంఘనాయకులను, పెద్దలను, కాపరులను, సువార్తికులను, ఉపదేశకులను ఆశీర్వదించండి. మా దేశమును, దేశ ప్రజలను పరిపాలకులను అధికారులను బలపర్చండి. ఆశీర్వదించండి. లోకములోని అధికారములన్నీ నీవు నియమించినవే! దేశ క్షేమము, భద్రతా దృష్ట్యా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి. యువతీ యువకులు నీ బిడ్డలై, నీ మహిమార్ధమై పరిశుద్ధతలో నీ నైతిక ప్రమాణమునకు ఎదుగునట్లు వారిని కనికరించండి. దేవా! రోగులను, అపవిత్రాత్మ చేత పీడించబడే వారిని ముట్టి వారిచే విడుదల ప్రసాదించండి. సువార్త నిమిత్తమై శ్రమలనుభవించె వారిని బలపర్చండి. విదేశములలోనున్న నీ బిడ్డలను కాచికాపాడు ప్రభూ! నీ బిడ్డలందరికీ వాక్యాశీర్వాదములు, సంఘాశీర్వాదములు, సహవాసాశీర్వాదము, సాక్ష్యాశీర్వాదములు మెండుగా దయచేసి మహిమపొందుమని మా ప్రియ రక్షకుడు ప్రభువైన యేసు క్రీస్తువారి పరిశుద్ధనామమున ప్రార్థిస్తున్నాము తండ్రీ! ఆమేన్!



ఈ రోజున మనము యోవేలు గ్రంథం ధ్యానించబోతున్నాము. యోవేలు అంటే “యోవే” అనగా యెహోవాయే దేవుడు అని అర్థం. ప్రభువు యొక్క మహాదినాన్ని ప్రకటించే ప్రవచన గ్రంథం యోవేలు. గ్రంథం చిన్నదే అయినా సందేశం చాలా గొప్పది. ఈ గ్రంథంలో మూడే అధ్యాయా లున్నాయి. అయితే మటుకేం: ఈ గ్రంథం అణుబాంబు లాంటిది. శక్తిభరితమైన గొప్ప సందేశం ఈ గ్రంథంలో వుంది. యోవేలు పుట్టు పూర్వోత్తరాలు మనకు వివరంగా తెలియవు. పెతూయేలు కుమారుడైన యోవేలు అని గ్రంథం ఆరంభమవుతుంది. యోవేలు అనే పేరు యూదులలో సర్వ సాధారణమైనది. యోవేలు తండ్రి పెతూయేలు. సమూయేలుకు కూడా యోవేలు అనే కుమారుడొకడున్నాడు. (1సమూ 8:1-2. సమూయేలు వృద్ధుడై నప్పుడు తన కుమారు లను ఇశ్రాయేలీయుల మీద న్యాయాధి పతులుగా నియమించాడు. అతని జేష్ఠ కుమారుని పేరు యోవేలు. సమూయేలు కుమారులు తను తండ్రి ప్రవర్తనను అనుసరింపక ధనాపేక్షకులై, లంచాలు పుచ్చు కొని న్యాయాన్ని తిప్పివేశారు. సమూయేలు కుమారులు చేసిన నిర్వాకమిది. తండ్రికి చెడబుట్టిన కొడుకులు. అయితే ఈ గ్రంథ రచయిత యోవేలు పెతూయేలు కుమారుడు, ఇతడు గొప్ప ప్రవక్త. యోవేలు గొప్ప ప్రవక్త. యోవేలు యెరూషలేములో ఆ పరిసర ప్రాంతాలలో సేవ చేశాడు. తన ప్రవచనాలలో పదేపదే దేవుని గృహము మందిరము, దేవుని ఇల్లు అంటాడు యోవేలు. యోవేలు 1:9. నైవేద్యము, పానార్పణము యెహోవా మందిరములోకి రాకుండా నిలిచి పోయాయి. యెహోవాకు పరిచర్య చేసే యాజకులు అంగలారుస్తున్నారు. యోవేలు 3:21 యూదా దేశములో నివాసులు నిత్యము వుంటారు. తరతరములకు యెరూషలేము వుంటుంది. యెహోవా సీయోనులో నివాసిగా నివసిస్తాడు. యోవేలు 3:17 అన్యులు యిక మీదట దానిలో సంచరించకుండా యెరూషలేము పరిశుద్ధ పట్టణముగా వుంటుంది. నీ దేవుడనైన యెహోవాను నేనే; నాకు ప్రతిష్ఠితమైన సీయోను పర్వతమందు నివసిస్తున్నానని మీరు తెలుసుకుంటారు. ఈ మాటలను బట్టి యోవేలు యూదా దక్షిణ రాజ్యంలో సేవ చేశాడని తెలుస్తుంది. యోవేలు ప్రకటన విధానం ప్రాచీన ప్రవక్త లను పోలివుండటం విశేషం!

యోవేలుకు ముందు వచ్చిన యాభైమంది ప్రవక్తల వరవడే యితనిది! యూదా రాజైన యోవాషు కాలంలో యోవేలు సేవ చేశాడు, అనగా యోవేలు ఏలియాకు, ఎలీషాకు సమకాలికుడు. యోవేలు ప్రవచనాల్లో కీలకాంశం ప్రభువు యొక్క రోజు యెహోవా దినం. ఈ గ్రంథంలో 5సార్లు ప్రభువు దినము అనే మాట వస్తుంది. ఆహా! యెహోవా దినమువచ్చిందే. అది ఎంత భయంకరమైన దినం. యెహోవా దినము వస్తున్నది; అది సమీపమైనదని దేశ నివాసులందరూ వణుకుదురుగాక! ఆదినము అంధకారమయం. మహాంధకారం కమ్ము తుంది. మేఘములు, గాడాంధకారం ఆ దినమున కమ్ముతాయి. ఆకాశము ఉరిమి తత్తరిల్లుతుంది. సూర్యచంద్రులకు తేజోహీనత కలుగుతున్నది. నక్షత్రాలకు కాంతి తప్పు తుంది. యెహోవా దినము బహు భయకరం! దానికి తాళగల వాడెవడు? ఆకాశమందు, భూమి యందు మహత్కార్యములు అనగా రక్తము అగ్ని, దూమ స్తంభాలను కన పరుస్తాను. యెహోవా యొక్క భయంకరమైన ఆ మహాదినం రాకముందు


సూర్యుడు తేజోహీనుడవుతాడు. చంద్రుడు రక్తవర్ణ మవుతాడు.

యెషయా, యిర్మియా, యెహెజ్కేలు దానియేలు వీరందరూ ప్రభువు మహా దినమును ప్రవచించిన వారే! అప్పుడప్పుడు "ఆ దినము" అంటూ వచ్చారు. జెకర్యా అయితే " ఆదినము" అంటాడు. ఆ దినం అంటే ఏ దినం? అదే ప్రభువు దినం, యెహోవా దినం. యెహోవా దిన ప్రవచనాలను యోవేలు ఎక్కువగా పలికాడు. ప్రవచన పర్వత శిఖరాగ్రమునుండి కొన్ని శతాబ్దాలు ముందుగా చూచినవాడై యోవేలు ప్రవచించాడు. యోవేలుకు ప్రవక్తలందరి కంటే ఈ విషయంలో దూరదృష్టి వుంది. యోవేలు యెహోవా మహా దినాన్ని ప్రవచన నేత్రాలతో చూచాడు. అతడు దీర్ఘ దర్శి. యెహోవా దినము బైబిలు పరిభాషలో సాంకేతిక పదం. ఈ దినంలో వెయ్యేండ్ల పరిపాలన అంతా యిమిడివుంది. అనగా యేసుక్రీస్తు యొక్క రెండవరాకడ. యెహోవా దినము మహా శ్రమలతో ఆరంభిస్తుంది. యెహోవా దినం ముగింపు అంటే వెయ్యేండ్ల పరిపాలన ముగింపు అని గ్రహించాలి. యేసు ప్రభువు అవినీతిని అంతమొందించే సమయం. భూమిపై రోజు, ప్రభువు మహాదినం అనే మాటను ఏడు సందర్భాలలో ప్రయోగించారు. సంఘం ఈ లోకంలో వున్న కాలం కాదిది. ప్రవక్తలెవ్వరూ సంఘమును గురించి అన్యుల మధ్య నుండి దేవుడేర్పరచు కున్న ఈ సంఘాన్ని గురించి ప్రవచించి వుండలేదు యూదులు, అన్యులు అందరిలో నుండి సేకరించిన వారిని దేవుడు సంఘ శరీరంగా రూపొందిస్తున్నాడని ఏ ప్రవక్తా ప్రవచించలేదు. ఈ సంఘం ఎత్తబడుతుంది. అందుకే ప్రవక్తల ప్రవచన అంశమైన యెహోవా దినం సంఘానికి సంబంధించింది కాదు. యెరూషలేములో మహా సదస్సు జరిగింది. అందులో యాకోబు అనే జేమ్సు మాట్లాడాడు. యాకోబు ఏమి చెప్పాడు? సంఘయుగానికి, ప్రభువు దినానికున్న సంబంధాన్ని వివరిస్తూ యాకోబు అన్నాడు. అపొ.కార్య 15:14-16 వచనం వరకు అన్యజనులలోనుండి దేవుడు తన నామము కొరకు ఒక జనమును ఏర్పరచు కొనడానికి వారిని ఏలా మొదట కటాక్షించాడో సుమెయోను వివరించాడు. యిందుకు ప్రవక్తల వాక్యములు సరిపడి వున్నాయి.

ఎట్లనగా ఆ తరువాత నేను తిరిగి వస్తాను. మనుష్యులలో కడమవారు నా నామము ఎవరికి పెట్టబడిందో ఆ సమస్తమైన అన్యజనులు ప్రభువును వెదకునట్లు పడిపోయిన దేవుని గుడారమును తిరిగి కడతాను. ఆ తరువాత నేను వస్తాను అంటే సంఘం ఎత్తబడిన తర్వాత అని అర్థం చేసుకోవాలి. సంఘం ఎత్తబడిన తర్వాత యిశ్రాయేలుతో దేవుని కార్యక్రమమున్నది. యెహోవా దినము అంటే ఆ కాలమే! అదేకాలం! యాకోబు వివరణ ఎంతో అర్థవంతమైనది. అప్పుడు దావీదు గుడారాన్ని తిరిగి కడతాను. అయితే ఈ రోజున దేవుడు అన్ని జాతులనుండి అన్య ప్రజలలోనుండి అందరిని పిలుస్తున్నాడు. వచ్చిన వారందరూ సంఘమవుతున్నారు. ఇది ఒక శరీరంగా రూపొందుతూవున్నది. దేవుని రాజ్యంలోకి ఆరోజున వారూ వీరూ అందరూ రావటం ఒక మహా సంఘటన. అందుకే యెరూషలేము సదస్సులో యాకోబు అన్నాడు. అపొ.కార్య. 15:18 మనం అన్యజనులలోనుండి దేవుని వైపునకు తిరుగుతున్న వారిని మనం కష్టపెట్టకూడదు" అనాదికాలమునుండి దేవుడు తెలియపరిచాడు. ఇది దేవుని కార్యక్రమం. ఇది ఆయనే నిర్వహిస్తాడు. ఎందుకు అంటారా? ఆ ప్రశ్న అడగటానికి మనము ఏపాటివారము?



## గళ్ళ నుడి కట్టు ఫిబ్రవరి '08



**సూచనలు:**

1. స్పందనలో ప్రింట్ చేసిన గ.ను.క. లోనే పంపాలి. వేరుగా పంపినవి స్వీకరింప బడవు.
2. పూర్తిచేసిన గ.ను.క. లు ఫిబ్రవరి 20 లోపు మాకందేటట్లు పంపాలి.

పూర్తి చేసి పంపిన వారి పేరు:............................................................................

చిరునామా: ............................................................................................

**అడ్డం:**

1. దాసి దాని కొడుకు స్వతంత్రుడు కాడు.
3. యెహోవా క్షేమము పంపుతాడు. న్యాయాధి 6:24.
8. క్రైస్తవంలో ఈ ప్రవేయం లేదు.
9. యేసు పనిమీద ఉండే "నిద్రపోను లెండి"! మరి "ని" "ఎక్కడ?"
10. దేవుడిది ప్రత్యక్షం. మరి మతం ఎవరి మతం?
11. ప్రజలు కూడుకునే హాలు
13. బైబిలు పారాయణ వెనుకనించి ముందుకు కూడా చేయొచ్చు!
15. పౌలు పుట్ట రాష్ట్రం, ఊరు